దీపావళి ప్రత్యేక సంచిక నవల

# ఆకృతి

## కుప్పిలి పద్మ

**ముందు మాట**

స్వేచ్ఛా విహంగాల రెక్కలకి మంచు బిందువులు కూడా అవరోధాలే.

సముద్రం ఎంత బాగుంటుంది! దాని విజృంభణా సౌందర్యాన్ని వీక్షిస్తూంటే ఎంతో ఆనందం, గర్వం, తృప్తి, ప్రేమ! అలాంటిదే స్వేచ్ఛా విజృంభణల కలగలుపు. అందులో మునిగితే ప్రతి కదలికా హృదయపు సవ్వడే.

పసితనంలో మైమరపించిన పాట ఎన్నాళ్ళకో అనుకోకుండా వినబడినప్పుడు స్పందించి, పులకరించే క్షణంలోనే...ఒకప్పటి ఆనంద విషాదాలు జీవితంలో తిరిగి తిరిగి స్ఫురిస్తాయి.

అంటే ఆయా అనుభవాల పరిమళం ఆ క్షణానికి మాత్రమే పరిమితం కాదు. అనుభూతి సాంద్రతకి అర్థం చెప్పుకోగలిగితే దాని స్ఫూర్తికి అంతే లేదు. అటువంటి సంఘటనలని ఏర్చికూర్చి రాస్తే- అదే నా యీ నవలకి ప్రేరణ.

— కుప్పిలి పద్మ

ఆమె ఆకృతి.

నడి వేసవి మల్లెలా నవ్వుతుంది.

తడిపొడి జల్లుల మధ్య తొంగిచూసే హరివిల్లులా వుంటుంది. నిరంతరం ఆలోచనల్లో తేలియాడే విశాల నేత్రాలు, చిక్కని నలుపు రంగులో ప్రకాశించే కనుపాపలు, ప్రశాంత వదనం ఆమె స్వంతం. డిగ్రీ ఆఖరి పరీక్ష రాసి అయిదేళ్ళు మధురమైన జీవితాన్ని అందించిన కాలేజీని, తనకు ప్రాణప్రదమైన ఆ తోటలోని మొక్కల్నీ, పువ్వుల్నీ పలకరించినట్టు,పలవరిస్తున్నట్టు తిరుగాడుతూ గంటలు గడిపేస్తుంటే–నీరజ లాగి బస్సెక్కించింది.

ఆకృతి ఇంట్లోకి అడుగు పెడుతూండగానే సుధీర్ ఎదురొచ్చి "ఎగ్జామ్ ఎలా రాసావ్?" అని ఆత్రంగా అడిగాడు.

అన్న ప్రశ్నకి జవాబుగా "కోయిల పాట విన్నాను" అంది.

"కోయిల పాటా!" సుధీర్ ఆశ్చర్యంగా అడిగాడు.

"ఈ వసంతానికి నేనివ్వాళే తొలిపాట విన్నాను"



"చంపావ్ పో. పేపరంతా కూకూ అని నింపేసావా? ఇలా అయితే నీకీ జన్మకి డిగ్రీ చేతికి రాదు" హేళనగా నవ్వుతూ అన్నాడు సుధీర్.

"నీకు నచ్చదా" అడిగిందామె.

"ఏముందా స్వరంలో గొప్పతనం? ఏదో కూకూ అని విన్పించటం తప్ప ఏం బాగుంటుంది?" తేలిగ్గా అడిగాడు.

"బాంబుల రొదలో కర్ణభేరి పగిలిపోయిన నీ చెవికి కోయిల పాటలెలా

మధురంగా తోస్తాయ్?" జాలిగా అంది ఆకృతి.

సుధీర్ డిఫెన్స్‌లో పనిచేస్తున్నాడు.

"కర్ణభేరి పగిలిపోయిన మేమే మీకు భద్రతనిచ్చేది. ఆమని-కోయిః అంటూ మురిసిపోయే మీలాంటి కళాపోషకులు కారు" గొప్పగా అన్నాడు.

"కళకి పోషకులెవ్వరూ అక్కర్లేదు" చప్పున చెప్పిందామె. గొల్లున నవ్వాడ తను.

ఆకృతి తల్లి విమల, సుధీర్ తల్లి శ్యామల అక్కా చెల్లెళ్ళు.



# తెల్ల మచ్చలకు చికిత్స



సంవత్సరముల తరబడి పరిశోధించి పరిశ్రమించి తెల్ల మచ్చల చికిత్స కొరకు అద్వితీయమైన మందును కనుక్కొనడమైనది. ఇది చాలా చురుకైన మందు, చికిత్స మొదలు పెట్టిన వెంటనే మచ్చల యొక్క రంగులో మార్పు కనిపించును తెల్ల మచ్చల కారణభూతములైన రోగక్రిములను నివారించి, శరీరపు రంగులో కలిపి వేయును, ఒక వేళ మీరు అన్నిచోట్ల, చికిత్సపొంది నిరాశ నిస్పృహ చెందినట్లైతే ఒక సారి మా మందును, పరీక్షించి చూడవలెను, ఎక్కడ ఉన్నవి, వాటి రంగు, వాటి పరిమాణము మరియు పూర్తి వివరములు వ్రాసి సలహా లేదా చికిత్స కొరకు వ్రాయండి.

**SHYAM AYURVED BHAVAN** (A-J)
P.O. Katri Sarai (Gaya) PIN : 805 105

# తెల్ల వెంట్రుకలు మరియు వెంట్రుకలు రాలిపోవుట

జుట్టును డై చెయ్యనవసరం లేదు మా ఆయుర్వేద చికిత్స (ఆయిల్) వల్ల తెల్ల వెంట్రుకలు మామూలు నలుపు రంగులోనికి మారి స్థిరంగా నిలుస్తాయి. జుట్టు రాలిపోకుండా కాపాడి జుట్టు రాలిన ప్రదేశాన కొత్త జుట్టు వస్తుంది. ఇది మెదడును చల్ల పరుస్తుంది, ఒక కోర్స్లో 3 ఫైల్స్ ధరరూ 60/ పోస్టేజి మరియు ప్యాకింగ్ అదనం.

**SHYAM AYURVED BHAVAN** (A-T)
P.O. Katri Sarai (Gaya) PIN : 805 105

# దాంపత్య జీవితాన్ని ఆనందించండి

బాల్యంలో చేసిన పొరపాట్ల వలనగాని దుస్సాంగత్యం వలనగాని దాంపత్య జీవితములో ఆనందంలేని యెడల, జీవితము దు:ఖమయమై నిరాశ చెందిన వారికి, శరీరములో గుప్తరోగములు జీర్ణించిన వారికి గాని, మూత్రంలో ఇంద్రియము వస్తున్న యెడల, కలలో స్ఖలనము జరుగుచున్న యెడల గాని, శీఘ్రస్ఖలనము, నరముల బలహీనత, శిశ్నము యొక్క వంకర, నపుంసకత్వము వలన మీరు బాధ పడుచున్న యెడల, ఇంద్రియములో శుక్రకణములు లేకుండినగాని, స్త్రీల కుసుమ వ్యాధుల వలన బిడ్డలు పుట్టకుండిన ఈరోజే మీ పూర్తి వివరములు వ్రాసి నిజమైన ఉచిత చికిత్స కొరకు వ్రాయండి

**General Treatment Rs.175, Necessary Treatment Rs 375/-, Special Treatment Rs.675/-**

*Ask for FREE booklet "Jauban-Sanjiban"*

*SHYAM AYURVED BHAVAN* (A-G)
*P.O. KATRI SARAI (GAYA)*


విమలకి ఇద్దరు కూతుళ్ళు. ఆకృతి, అరుణ. విమల భర్త ఆనందరావు పేపర్ మిల్స్లు వుద్యోగి. అరుణ ఇంటర్ పరీక్షలు రాసింది.

శ్యామలకి ఆరుగురు కొడుకులు. సుధీర్ పెద్దవాడు. రెండేళ్ళ క్రితం మిలటరీలో చేరాడు. భర్త విశ్వేశ్వరరావు స్టేట్ గవర్నమెంట్ వుద్యోగి. శ్యామల కుటుంబం హైదరాబాద్లో వుంది.

సెలవుపై హైదరాబాద్ ఎప్పుడొచ్చినా రాజమండ్రి వచ్చి ఆకృతి, అరుణలతో రెండు మూడు రోజులు గడిపి వెళ్ళటం సుధీర్కి అలవాటు. ఈసారి తనతోపాటు ఆకృతిని తీసుకెడతానన్ని పెద్దమ్మని అడిగాడు.

"మీ బాబాయ్తో చెబుదాం" అంది విమల.

ఆకృతికి విశాఖ చూడాలని వుంది. తండ్రి పంపిస్తే బాగుండుననుకుంది.

అరుణకి ప్రాక్టికల్స్ ఇంకా కాలేదు. అదీకాక విశాఖ చూడాలనే సరదా ఆమెకి లేదు. ఆమె చూపెప్పుడూ మద్రాసు వేపే. సినీతార అవ్వాలని ఆరాటం. రెండు రోజుల తర్వాత ఆకృతి, సుధీర్ బయలుదేరారు.

* * *

ఆకృతి రాజమండ్రి స్టేషనులో దిగింది. సుధీర్ అదే ట్రైన్లో హైదరాబాద్ వెళ్ళిపోయాడు.

ఆకృతి ఇంటికి వచ్చేసరికి అరుణ నవ్వు ముఖంతో ఎదురొచ్చి "నీకో గుడ్ న్యూస్. ఏంటో చెప్పుకో" అంది.

"ఏమో" అంది ఆకృతి.

"నటనా రజతోత్సవాలు చేసుకుంటున్న హీరోయిన్లా మరీ అంత నిర్లిప్తంగా 'ఏమో' అనకోయ్. కాస్త ఆలోచించు" చిరుకోపంగా అంది అరుణ.

"ఆలోచించే ఓపిక లేదుకాని ఏంటో చెప్పు" అంది ఆకృతి కుర్చీలో కూర్చుంటూ.

"పెళ్ళి చూపులోయ్"

"ఎవరికి" తుళ్ళిపడి అడిగింది ఆకృతి.

"ఏడ్చినట్టుంది. ఎవరికో అయితే నీకెందుకు శుభవార్తవుతుంది. నీకే" అంది అరుణ.

"నాకా!" ఆశ్చర్యంగా అంది ఆకృతి.

"నీకే. రేపే. అబ్బాయికి మద్రాసులో స్టూడియోలో వుద్యోగం. మా మంచి అక్క కదా. పెళ్ళవగానే తోడుగా నన్ను పట్టుకుపో. నీ పుణ్యాన హీరోయిన్ అయిపోతా"

"అమ్మేది" అడిగింది ఆకృతి.

"దేవి చౌక్కి వెళ్ళింది. రేపటికి కావల్సిన స్వీట్స్, పళ్ళు తీసుకురావటానికి" చెప్పింది అరుణ.

ఆకృతికి అంతా కొత్తగా వుంది.

బాగా చదువుకోవాలి. మంచి వుద్యోగంలో చేరాలి. కొత్త కొత్త ప్రదేశాలు చూడాలి. స్పందింప చేయగలిగే కవిత్వం రాయాలి—ఇంతే ఆమె ఆలోచనలు.

కళ్ళ ముందు ఆంధ్రా యూనివర్సిటీ మెదిలింది.

పచ్చ పచ్చని చెట్ల మధ్యలో పురాతన కట్టడాలు. సముద్ర గాలులు పాడే మైత్రీ గీతాలతో ధన్యమైన విశాఖ అణువణువు ఆహ్వానిస్తున్నట్టే వుంది.

"ఇంట్లో వాళ్ళు చదివించడానికి ఒప్పుకోపోతే ఎలా చదువుకోవాలి?"

సినిమాల్లో, కథల్లో చూపించినట్టు చెప్పినట్టు అంట్లు తోమి, బట్టలు కుట్టి, ట్యూషన్స్ చెప్పి చదువుకోగలనా?

అలా చెయ్యలేను.

పోనీ అమ్మానాన్న తెచ్చిన అబ్బాయికి తలొంచి బుద్ధిగా మూడు ముళ్ళు వేయించుకోగలనా?

ఊహు అలాగా చెయ్యలేను. ఏదీ చెయ్యలేను. ఇంకెందుకీ బ్రతుకు?"

* * *

"ఏంటే, పెళ్ళిచూపులకి కూర్చోవా" బిత్తరపోతూ అడిగింది విమల.

"ఎందుకలా అరుస్తావ్. కూర్చోపోతే నిల్చుంటుందిలే" పూలు మాల కడుతున్న అరుణ అంది.

"నువ్వు నోరుముయ్" కసిరింది విమల.

"ఏంటక్కా పెళ్ళిచూపులేగా. పెళ్ళే చేసేస్తున్నట్టు వెర్రిముఖం పెట్టావ్? ఎంచక్కా ఆ మైసూర్ సిల్క్ శారీ కట్టుకొని, ఇదిగో ఈ పూలు తల్లో పెట్టుకుని, ఆ పెద్ద బంగారం గొలుసు మెడలో వేసుకొని అలా అలా నడిచి పెళ్ళికొడుకు ముందు నిలబడ్డావనుకో నో కట్నం, నో కానుక" గబగబా అంది అరుణ.

అంతేనా పెళ్ళిచూపులంటే. కాదు. కాదు. శరీరాన్ని చూసే ఘుగవాడు, శరీరంపై పట్టు వస్త్రాలని, బంగారు నగల్ని చూసే స్త్రీలు ఛ...ఛా...ఏమైనా కానీ నేనలా నిలబడలేను.

"నా వల్ల కాదు" ఖచ్చితంగా చెప్పేసింది ఆకృతి.

రాత్రి నుండి ఆకృతిని ఒప్పించడానికి విమల శతవిధాల ప్రయత్నిస్తూంది. అసలిలా ఆకృతి వ్యతిరేకిస్తుందని విమల వూహించనూ లేదు.

"పెళ్ళి చేసుకోవటం గురించి తర్వాత ఆలోచిద్దాం. ముందీ పెళ్ళి చూపుల తతంగం కానీయ్" అంది విమల.

"కాన్సిల్ చెయ్"

"నీకేమైనా మతిపోయిందా. మన పరువేం కావాలి. రేపసలు నీ పెళ్ళి, అరుణ పెళ్ళి చెయ్యగలమా? నలుగుర్లో తలెత్తుకోగలమా?" కోపంగా అరిచింది విమల.

"పరువు కోసం నాకిష్టంలేని పని చెయ్యను" నిర్మొహమాటంగా చెప్పింది ఆకృతి.

విమల వింతగా ఆకృతి వేపు చూసింది. ఇది తను కని పెంచిన కూతురేనా? అమాయకురాలు తన పనేదో తనది అని అనేకసార్లు జాలిపడిన కూతురేనా? పది మందిలో కలవలేదు. ఎలా బ్రతుకుతుందీలోకంలో అని కలతచెందిన కూతురేనా?

విమల భర్తకి ఆకృతి గొడవ చెప్పింది. "ఎలా ఇవ్వదు?" అంటూ కాసేపు నిస్తేజంగా చూసిన ఆనందరావుకి ఆకృతిపై వెర్రి కోపం వచ్చింది.

"ఏంటి నీ వుద్దేశ్యం" చిరాగ్గా అడిగాడు.

ఆకృతి మాట్లాడలేదు.

"ఇన్నేళ్ళు పెంచి, చదివించినందుకు మా గౌరవాన్ని బానే నిలబెడుతున్నావ్" ఈసడింపుగా అన్నాడు ఆనందరావు.

అరుణకి అక్కని చూస్తుంటే జాలేస్తూంది. పిచ్చిది. పెళ్ళి చూపులకి కూర్చుంటే ఏమవుతుంది? ఇంత రాద్ధాంతం చేస్తూంది.

"ఏం చేద్దాం" అడిగాడు ఆనందరావు నిస్సహాయంగా విమలని.

విమల చాలాసేపట్నుంచి అదే ఆలోచిస్తూంది.

"ఆకృతికి ఒంట్లో బాగోలేదు. అందుకే నిన్న వైజాగ్ నుండి రావల్సింది రాకుండా ఆగిపోయిందట. టెలిగ్రాం వచ్చింది అని చెబుదాం" అంది విమల. ఇది రాత్రే ఆమె ఆలోచించి పెట్టుకుంది.


ఆనందరావుకీ అంతకు మించిన మార్గం కన్పించలేదు. చెప్పి వస్తానని విసురుగా లేచి వెళ్ళాడు. తల్లి కోపంలో వుందని నీరజ ఇంటికి బయలు దేరింది ఆకృతి.

నీరజ ఇవతలి వాళ్ళని మాట్లాడనివ్వదు. ఆకృతి క్లాస్‌మేట్. స్నేహితురాలు.

నీరజ ఆకృతిని చూసి "ఎప్పుడొచ్చావ్ వైజాగ్ నుండి" అంది చిర్నవ్వుతో.

"రాత్రి"

"ఎప్పుడొస్తావాని ఎదురు చూస్తున్నా. నా పెళ్ళి. ఇంట్లో ఒప్పుకోవటం లేదు. మీ నలుగురూ కాస్త సంతకాల పెళ్ళికి ఏర్పాట్లు చేస్తే మీ పెళ్ళిళ్ళకి




## సన్నాయి పాట

జాము రాతిరి కాడ
జాజి పూలు రాలిపడెనా
జాలు జాలుగా వెన్నెల
జారి జారి పైన బడెనో
జాలి జాలిగా సాగెను
గాలి సన్నాయి గాలుల
తేలి సన్నాయి

సంతలోనా సగము సాగి
సరగుతోటల కొసరి ఆగి
మావి కొమ్మల మాటు బాసలు
సరసగా వినిపించెనమ్మా
సరసనే అనిపించెనమ్మా
గురుతు సన్నాయీ నే నెటు
మరతు సన్నాయీ

వాగుదరినా వంక మొగనా
కొండ పైనా కోనలోనా
తూగు టూయెల తోటలోనా
ఊగి ఊగి మ్రోగెనమ్మా
ఆగి ఆగి సాగెనమ్మా
పూల సన్నాయీ పూవుల
తేనె సన్నాయి

చెంప తాకి చెవిని ఊది
కురులు నిమిరి మరులు రేపి
మంచి గంధపు వాసనల్లె
చుట్టు చుట్టు అలదెనమ్మ
ఒట్టు ఒట్టని అల మెనమ్మ
వలపు సన్నాయీ బ్రతుకున
మేలుపు సన్నాయీ



డా. సుశీలాదేవి

# LEARN UNIVERSAL ART BY POST

చిత్రకళను మీరు పోస్టుద్వారా మీ ఇంటి వద్దే అభ్యసించవచ్చు. మద్రాసులో వున్న ప్రసిద్ధ చిత్రకారుల చేత మా "బాపు ఆర్ట్ స్కూల్" యొక్క పాఠాలు తయారు చేయబడ్డాయి.

మా సంస్థలో చేరదలచుకున్న వారు "పది" రూపాయలు మనీఆర్డర్ చేయండి. మా "బాపు ఆర్ట్ స్కూల్" వివరాలు, అప్లికేషన్‌ఫారం మొదలగునవి పోస్టు ద్వారా మీకు పంపుతాము.

ముఖ్య గమనికలు :


1. మనీఆర్డర్ ఫారం క్రింది ఖాళీ స్థలంలో (SPACE FOR COMMUNICATION అనే చోట) మీ అడ్రసు క్లియర్‌గా వ్రాయాలి.
2. కవర్లలో డబ్బులు పెట్టి పంపరాదు. అలా చేసినవారికి అప్లికేషన్‌ఫారం పంపబడదు.

క్రింది మా చిరునామా :

BAPU ART SCHOOL
4, AGASTHIAR STREET
GANDHI NAGAR, MADRAS-600093



Bapu Art School
Regd. No. 7017

మా చేతనైన సాయం చేస్తాం" బ్రతిమాలుతున్నట్టు అంది నీరజ.

"పెళ్ళి కొడుకెవరూ? ఇంతకీ ఏ నలుగురూ సాయం చెయ్యాలి" అడిగింది ఆకృతి.

"పెళ్ళి కొడుకు వినోద్. మీ నలుగురూ–అంటే నువ్వు, గగన్, అమృత, హర్ష" అంది నీరజ.

వినోద్ 'లా' పూర్తి చేసాడు. కాలేజీ ఎలక్షన్స్ టైమ్‌లో నీరజకి పరిచయం అయ్యాడు. అమృత నీరజ క్లాస్‌మేట్. గగన్ అమృత అన్నయ్య. హర బి.ఇడి. పూర్తి చేశాడు. సాహిత్యమంటే అభిమానం. ఆకృతికి కాలేజి విద్యార్థుల కవి సమ్మేళనంలో పరిచయం అయ్యాడు.

సాయంత్రం వరకు నీరజతో గడిపి ఆకృతి ఇంటికి బయలుదేరింది.

* * *

గౌతమీ గ్రంథాలయం ఆవరణలో వున్న పురాతన పొగడ చెట్టు చుట్టూ వున్న సిమెంట్ చప్టాపై కూర్చుని వున్నాడు హర్ష.

సూర్యకిరణం లాంటి చురుకైన, హాయిగొలిపే సౌందర్యం అతనిలో గోచరిస్తుంది. అతను వాచ్ వేపు చూసుకున్నాడు.

'ఆకృతి లైబ్రరీకి వచ్చేవేళ అయింది' అనుకున్నాడు.

ఓ అయిదు నిమిషాల తర్వాత మెల్లగా వచ్చింది ఆకృతి. ఆమెని చూసి అతడు చిన్నగా నవ్వాడు.ఆమె అతను కూర్చున్న వేపు నడిచింది. కాస్త పక్కగా కూర్చుంటూ చేతిలో పుస్తకాలు అతనికి అందించింది

"చదివారా? ఎలా వున్నాయి" అడిగాడు.

"ఆనాటి సమాజానికి అద్దంలా వున్నాయి" అందామె.

"ఇప్పటి రచనల్లో సమాజం ప్రతిబింబించటం లేదా" చిర్నవ్వుతో అడిగాడు హర్ష.

"లేదు" స్పష్టంగా ఖచ్చితంగా చెవుతున్న ఆకృతి.

"మీరెందుకు రాయరు"

"ఏంటి రాయాలి"

"కథ, కవిత, నవల"

"ఇంకా నయం-ప్రేమలేఖలు రాయమనలేదు" అంటూనవ్వింది - గోదారి పిగ్గుపడ్డట్టు.

"రాయచ్చు"

"ఎవరికి?"

"నాకే!" చప్పున అనేసి హర్ష ఆమె కళ్ళల్లోకి కంగారుగా చూశాడు.

అయితే ఆమె ఆ విషయానికి ప్రాధాన్యత ఇవ్వకుండా "మీకా" అంటూ నవ్వి "అర్థమవుతాయంటారా" సందేహం వ్యక్తపరిచింది.

అతనికి నిరుత్సాహంగా అనిపించింది. ఆమె "మీకా" అంటూ కోప్పడినా, తత్తరపడినా గుండెల్లో అమాయకంగా లాలిత్యపు పొరల్లో అల్లుకు పోయిన అనురాగాన్ని

నివేదించేవాడు. మరో అరగంట కబుర్ల తర్వాత ఆమె వెడతానని లేచింది.

***

తలుపు తట్టిన శబ్దానికి అప్పుడే నిద్రలేచిన ఆకృతి తీసింది. ఆమెనే చూస్తూ చేతిలో పేపర్ అందించాడు హర్ష.

"రిజల్ట్సు వచ్చాయా" వరండాలోకి వచ్చిన విమల కంగారుగా అడిగింది.

"ఆ" అన్నాడు హర్ష.

ఆకృతి నంబర్ వెతుకుతూ కన్పించగానే "హమ్మయ్య" అనుకుంటూ పేపర్ మడిచింది.

"ఏమయింది" ఆత్రంగా అడిగింది విమల.

"పాస్ అయ్యాను" అంది ఆకృతి.

"ఏ క్లాస్" వుద్వేగంగా అడిగింది అరుణ.

"సెకెండ్ క్లాసా" అడిగింది విమల.

"ఊహు" అంది.

"ఫస్ట్ క్లాసా"

హర్షకి ఆకృతిని చూస్తుంటే వింతగా వుంది. పరీక్షలో పాసైన సంతోషం కాని, ఫస్ట్ క్లాసొచ్చిన మెరుపుకాని ఆమె ముఖంలో రవ్వంత కూడా లేదు.

"అక్కా సినిమాకి వెళదామా?" అడిగింది అరుణ.

"ఉదయం ఆరు గంటలకేం సినిమా" కసిరింది విమల.

"నాన్నగారు సమయానికి క్యాంప్ వెళ్ళారు. లేకపోతే ఎంత సంతోషించేవారో" అంది

ఆకృతి పేపర్ హర్షకి ఇస్తూ "థాంక్యూ" అంది.

అప్పుడు పడింది విమల చూపు హర్షపై. 'ఇతడినెప్పుడూ కాలనీలో చూసిన గుర్తు లేదు. ఆకృతి క్లాస్‌మేట్ అనుకోడానికి ఆమె చదివిందేమో ఆడపిల్లల కాలేజ్‌లో. మరి ఈ కుర్రాడెవరో? ఇంత వుదయమే పేపర్ పట్టుకుని ఇంత ఆత్రంగా వచ్చాడంటే తప్పకుండా ఆకృతికి చాలా బాగా తెలిసినవాడే అయుండాలి. దీనిమీద అంతో ఇంతో అభిమానం వుండే వుంటుంది. తన కూతురని కాదుగానీ అసలే ఇది బంగారు బొమ్మ...! అమ్మో!, హఠాత్తుగా ఆమెలో మాతృబాధ్యత మేల్కొంది.

"ఎవరితను" అడిగింది విమల.

"హర్ష" అంది ఆకృతి.

విమల మాటలో తేడా గమనించి ఆకృతిని ఇబ్బంది పెట్టకూడదని "ఇక వెళతానండి" అని వెళ్ళిపోయాడు హర్ష.

"పేపర్‌పట్టుకొచ్చి కంగ్రాట్స్ చెప్పడేంటి" అంటున్న అరుణమాటలు అతనికి విన్పించాయి.

'కంగ్రాట్స్, థాంక్స్‌లకి మించిన ఆత్మీయురాలు ఆకృతి' అనుకున్నాడతను.

***

ఆకృతి రిజల్ట్సు వచ్చిన రెండ్రోజుల తర్వాత ఆనందరావు వచ్చాడు. ఆకృతికి ఫస్ట్‌క్లాస్ వచ్చిందని తెలిసి సంతోషించాడు. కూతురు యూనివర్శిటీ చదువులు చదువుతానని అడగగానే కాసేపు ముభావంగా వుండిపోయాడు. మరో రెండేళ్ళు చదివించటం ఆ పైన పెళ్ళి ఇంత ఖర్చు పెట్టటానికి కాని అన్నాళ్ళు ఆకృతి బాధ్యత వహించటానికి కాని అతని మనస్సొప్పుకోలేదు.

"నేనింక చదివించలేను" అన్నాడు ఆనందరావు.

ఇది ఆకృతి వూహించని విషయం. చదివిస్తారనే అనుకుంది.


"ఏం" అని అడగటానికి కూడాఆమెకి మనసొప్పలేదు. తనకి ఇష్టమైనవి బలవంతంగా అవతల వారిని ఒప్పించి పొందటం ఆకృతికి ఇష్టం లేదు.

"పెళ్ళి చేస్తాం" అంది విమల.

"నేనిప్పుడే చేసుకోను" అంది ఆకృతి.

విమలకి హర్ష గుర్తొచ్చాడు. 'ఆ కుర్రాడివలన ఆకృతి ఇలా పెళ్ళి చేసుకోనని చెపుతూందా...'

"చేసుకోక ఏం చేస్తావ్" ఆకృతి కళ్ళలోకి గుచ్చిగుచ్చి చూస్తూ అడిగింది



## పదిలం

ఈ జీవితం ఎంత చిన్నది?
దీని నందుకే సున్నితమైన పట్టుదారాలతో చుట్టి
ఆపై గులాబి మొగ్గలు తొడిగి
సంప్రదాయాల వలువలు చుట్టి
గాజు పలకల మధ్య పదిలంగా పెట్టి
భద్రంగా చూసుకో!
ఇంతలోనే చలించిక
హృదయాన్ని గుప్పెట్లో పెట్టుకొని
మెదడుని గుండెల్లో పెట్టి
ఈ మధురిమ చెదిరిపోకుండా
ఈ రూపం చెరిగిపోకుండా
ఉన్నన్నాళ్ళూ స్వచ్ఛంగా వుంచుకో!!

— సువర్ణరాణి బి.

విమల.

ఆకృతి ఇన్నాళ్ళు చదువుకోవాలని అనుకుంది. ఇప్పుడు తండ్రి చదివించనన గానే ఏం చెయ్యాలా అని ఆలోచిస్తూంది.

"ఏం చేస్తావ్ చెప్పు" విమల రెట్టించింది.

"ఉద్యోగం చేస్తాను" అంది ఆకృతి.

"ఉద్యోగమా? నీకెక్కడ దొరుకుతుందే?" వింత పడింది విమల.

"ప్రయత్నిస్తాను" అంటూ ఆకృతి హాల్లో నుండి తన గదిలోకి వెళ్ళిపోయింది.

***

మూడు రోజులుగా కన్‌స్ట్రక్టింగ్ సంస్థల చుట్టూ తిరుగుతూంది ఆకృతి. రోడ్డు క్రాస్ చేస్తుంటే "హలో" అని వినిపిస్తే తలతిప్పి చూసింది

శ్రీమాల - బాగా డబ్బున్న తండ్రికి పెద్ద కూతురు. ఇంటర్మీడియెట్‌లో ఆకృతి క్లాస్‌మేట్. ప్రస్తుతం విశాఖలో బి.ఇ. చదువుతూంది.

"మండుటెండలో ఏదో అన్వేషిస్తూ బయలుదేరావు. కొంపదీసి బాయ్‌ఫ్రెండ్ కోసం కాదుగా" అందామె నవ్వుతూ.

ఆ అమ్మాయి మాటలంతే. ఎప్పుడూ అందర్నీ బాయ్‌ఫ్రెండ్, బాయ్‌ఫ్రెండ్ అంటూ ఏడిపిస్తుంది. ఆమెకి మాత్రం ఒక్క ఫ్రెండూ లేదు.

"ఆ బాయ్‌ఫ్రెండ్ కోసమే" నవ్వుతూ అంది ఆకృతి.

"ఎవరా ఫ్రెండ్?? ఏమా కథా"

"ఉద్యోగం"


"చాలా కాస్ట్లీ ఫ్రెండ్. అయినా ఇలా తిరిగితే దొరుకుతుందా" అందామె.

ఇంటర్ చదివే రోజుల్లో ఇద్దరూ కాస్త స్నేహంగానే వుండేవారు. చదువులు వేరై కలుసుకోవటం తక్కువైయింది అయినా ఒకరంటే ఒకరికి అభిమానమే.

ఇద్దరూ బస్టాప్ దగ్గరకి వచ్చారు. ఆకృతి ఎక్కాల్సిన బస్సు వచ్చింది. బస్ దిగి రెండడుగులు వేసింది.

"ఆకృతీ" - హర్ష పిలుపు

# దారిన కాఫ్కా దానయ్యలు



అర్థరాత్రి సమయంలో
చందమామ వెన్నెల్లో
నాలుగు చుక్కలు నోట్లో వేసుకుని
ఎగువకెళ్ళే రోడ్డు మీద
అర్థంలేని ఏవో రెండు మంత్రాల్ని
నాలుకు మీద నానిస్తూ
మెల్లగా నడుస్తున్నావయ్యా నువ్వు.

అప్పడొకడు
ఎగువ నించి దిగువకి
నీ వైపే విసురుగా
పరిగెడుతూ వస్తున్నాడయ్యా.

కాని,
నువ్వు అతడ్ని పట్టుకోవు,
ఒక్కచిక్కిన చిరుగుబట్టల వాడయినా
వాడి వెనక నించే యింకొకడు
గట్టిగా అరుచుకుంటూ వస్తున్నా.

అతడ్ని, అలాగే
మీది నించి కిందికి పరిగెత్తుకుంటూ
వెళ్ళిపోనిస్తావ్, అడ్డుకోకుండా.

ఎందుకనీ అంటే:
అది అర్థరాత్రి
వెన్నెల్లో వీధి
దిగువ నించి ఎగువకే
నీ ముందునే సాగుతోంది.

అది కాక,
వాళ్ళిద్దరూ ఏ అర్థరాత్రి సరదాలాగా
ఈ వేటో వెంటాటో
మొదలు పెట్టి వుండవచ్చు

లేక
వాళ్ళిద్దరూ కలిసి
ఏ మూడో వాడ్నో
వెంటాడుతూ యీ వేట
చేస్తూ వుండవచ్చు
నువ్వు చూడని ఆ మూడోవాడి కోసం
చందమామ అర్థరాత్రి
వెన్నెల వీధిన

బహుశా
మొదటివాడు అమాయకుడూ
రెండోవాడు వాణ్ణి చంపవచ్చే హంతకుడూ
అయి వుండొచ్చు.
తీరా ఆలోచిస్తే,

వాళ్ళిద్దరూ
ఒకరి కొకరు
తెలియక పోవచ్చు;
ఎవరికి వారు వేరేవేరేగా
ఎవరింటికి వాళ్ళు
సుఖంగా నిద్రకోసం
చందమామ అర్థరాత్రిలో
వెన్నెల వీధిలో పరుగులు తీస్తూండొచ్చు.

వాళ్ళు
నిజమయిన రాత్రి పక్షులయి వుండొచ్చేమో?
మొదటవాడి చేతిలో
మారణాయుధ మేమయినా వు ందేమో

వెన్నెల చంద్రుని అర్థరాత్రి గడియల్లో
వెన్నుపోటు కోసం, యింకెవడో మూడోవాడి
వెన్నుపోటు కోసం.

ఏమయినా,
నీకు నువ్వు నువ్వుగా అలిసి పోటానికి
యీ వెన్నుపోట్ల వెన్నెల్లో హక్కులేదా?
నాలుగు చుక్కలు నీ రక్తంలో
దౌడు తియ్యడం లేదా?
రెండు మంత్రాలు నీ నాలుక మీద
యింకి పోటం లేదా?

మీది నించి
దిగివకి పోయే
అర్థరాత్రి వెన్నెల వీధి చివర్న
మలుపు తిరిగి
రెండోవాడు యిప్పడు కంటికి
మరుగుయి పోయాడు.
అప్పడు
నువ్వు అక్కడే వెన్నుపోట్ల కోలాహలంలో
నిలబడేవుంటావయ్యా
సకలం చూస్తూ
అంతట్నీ అందర్నీ
వదలివేసి ఎగువకి పోయే రోడ్డు మధ్య,
దిగువ వేపూ, మలుపు వేపూ
చూస్తూ,
చూస్తూ వుంటా
ఇంకా యింకొకడి కోసం.

— త్రిపుర

మండటెండలు ఎక్కువగా వున్నట్టు ని ముఖం భలే సాక్ష్యమిస్తూందే" అన్నాడు.

"రసాస్వాదనకి అకృతి కావాలండి"

"వ్వాట్" గట్టిగా అందామె.

"అస్పష్టమైన భావాలకి ఓ రూపం వస్తే తప్ప రసాస్వాదన, రసోద్దీపనలకు తావులేదని నా భావన తప్ప ని గురించి నేనేం అనల్లేదు" సీరియస్‌గా అన్నాడతను.

అంతా తెచ్చి పెట్టుకున్న సీరియస్‌నెస్.

చలాన్ని, కృష్ణశాస్త్రిని చదవని వాడు రచయితే కాదనే ఈ కుర్రాడికి ఆఫ్రికన్ పొయెట్రీ అంటే బోల్డంత అనురాగం. అకృతికి ఆ పొయెట్రీని పరిచయం చేసిందితడే. ఆ స్పందనతో వుత్సాహంగా కవితలు రాసింది అకృతి. అవి చూసినప్పడు హర్షకి చాలా ఆశ్చర్యం వేసింది. ఆమెలోని రమ్య కవితావేశం, భావ స్పష్టత అతడిని సమ్మోహ పరిచాయి.

"రండి. కాఫీ తాగుదాం" అన్నాడు.

"ఇప్పడొద్దండి"

"ఉద్యోగం దొరికే వరకూ కాఫీ తాగనని ఏమైనా మొక్కుకున్నారా"

"మొక్కుకుంటే తప్ప కాఫీ తాగకుండా వుండకూడదా" అడిగిందామె.

ఇద్దరూ దగ్గర్లో వున్న రెస్టారెంట్‌కి వెళ్ళారు. చల్లని గాలి, శాంత సంగీతం.

"స్నాక్స్ ఏం తీసుకుంటారు" అడిగాడతను.

"కాఫీ చాలు"

వెజిటబుల్ కట్‌లెట్ , కాఫీ ఆర్డర్ చేసి ఆమె వేపు చూశాడు.

'వాలిన కనురెప్పలపై ఏ కవిత రాయాలి – పద, కవితా –సదా కవిత్వమే నీ సాంగత్యమా – రసరమ్యకృతీ – అకృతీ – సహజ సౌందర్య ప్రకృతి'

"మీకు పువ్వులంటే చాలా ఇష్టం కదా" అడిగాడతను.

"పువ్వుల్ని, పిల్లల్ని ఇష్టపడని వారుంటారా"

"గుల్‌మోహర్‌పూల గురించి మీరాసిన కవిత చాలా నచ్చింది. నాకిస్తారా" అడిగాడు.

"తీసుకోండి"

"మీ దగ్గరుందా ఇప్పడు"


"లేదండి. రేవుసాయంత్రం లైబ్రరీకి వస్తాను. అప్పడిస్తాను" అందామె.


"నీరజ మ్యారేజ్ అరేంజ్‌మెంట్స్ పూర్తయ్యాయి. మీరొస్తున్నారుగా" అడిగాడతను.

"ఆ." అందామె.

"ఇంక చదువుకోరా. అప్పడే ఉద్యోగం వెతుక్కుంటున్నారు" అడిగాడతను.

"చదువుకోవాలనేవుంది. నాన్నగారు ఇంక చదివించనన్నారు. పెళ్ళి చెయ్యాలని అంటున్నారు. నాకప్పడే పెళ్ళి చేసుకోవాలని లేదు. ఉద్యోగం చేస్తానన్నాను.




ఉద్యోగం వచ్చాక ప్రైవేట్‌గా చదువుతాను" అంద్దామె.

అప్పలు దాపరికం లేకుండా అంత నిజాయితీగా తన కోరికలు, ఇంట్లో వాళ్ళ ఇష్టాలు, తన నిర్ణయాలు చెపుతున్న ఆకృతిని చూస్తుంటే అతనికెంతో ముచ్చటగా అనిపించింది.

"ఉద్యోగం చెయ్యడానికి ఇంట్లోవాళ్ళు ఒప్పుకున్నారా" అడిగాడతను.

"అభ్యంతరం చెప్పలేదు"

"చెపితే ఏం చేసేవారు"

"లక్ష్య పెట్టేదాన్ని కాదు" స్పష్టంగా చెప్పిందామె.

అతనికి ఎంతో ఇష్టంగా ప్రియంగా అపూర్వంగా కనిపిస్తుందామ్మాయి.

***

**మధ్యాహ్నం రెండున్నర.ఆకృతి అప్లికేషన్ రాస్తుంటే నీరజ వచ్చింది. ఆకృతి** అందించిన మంచినీళ్ళ గ్లాసు అందుకుంటూ "ఈ వూర్లో ఇండస్ట్రీస్ ఏమున్నాయి. ఇక్కడేం వుద్యోగాలు దొరుకుతాయి" అంది.

ఆకృతి జవాబు చెప్పలేదు. మంచినీళ్ళు తాగి గ్లాసు కింద పెడుతూ "హైదరాబాద్‌లో బోల్డన్ని కంపెనీలు. అక్కడ ప్రయత్నించు" అంది నీరజ.

"హైదరాబాద్‌లోనా" ఎక్కడుండాలి? ఎప్పడొస్తుందో తెలియదు. ఎలా కుదురు తుంది" అనాసక్తిగా అంది ఆకృతి.

"మీ పెద్దమ్మగారున్నారుగా. అయినా గవర్నమెంట్ వుద్యోగం వచ్చే వరకు ఆగకూడదా? కాంపిటేటివ్ ఎగ్జామ్స్ రాయొచ్చుగా" అంది నీరజ.

ఈ ఆలోచన బాగానే వుందనుకుంది ఆకృతి.

"హర్ష కనిపించాడా" అడిగింది నీరజ. ఆమెకి హర్షని 'మువ్వ' అని పిలిచేంత చనువుంది.

"ఆ నిన్ననే కనిపించారు. ఇవాళ లైబ్రరీ దగ్గరకి రమ్మని చెప్పాను. మ్యారేజ్ ఎరేంజ్‌మెంట్స్ అయ్యాయని చెప్పారు" అంది ఆకృతి.

"నేను నీతో లైబ్రరీకి వస్తాను. ఎలా ఇంట్లోంచి బయట పడాలో, ఏ గొడవ లేకుండా పెళ్ళి అవ్వాలో తనతో మాట్లాడాలి" అంది నీరజ.

ఆకృతి నీరజకి టీ చేసి ఇచ్చింది. ఇద్దరూ కాసేపు అవీ ఇవీ మాట్లాడుకుని లైబ్రరీకి బయలుదేరారు.

***

"హీరోయిన్ పాత్ర తప్ప మరేం వెయ్యను" స్పష్టంగా చెప్పింది అరుణ

"చిన్న చిన్న వేషాలతో సినిమా జీవితం ప్రారంభం అయితే తిరిగి అలాంటి పాత్రలే వస్తాయి. ఫీల్డ్‌లో వున్నవారు మీకు తెలియనిదేముంది" అందామె.


"హీరోయిన్‌గా వేస్తే చాలావరకు అర్ధనగ్నంగా నటించాల్సి వస్తుంది. ఆలా వేయగలరా" అడిగాడతను.

"ఆ" ఏమాత్రం సంకోచం లేకుండా చెప్పిందామె.

## రక్తం చిమ్మే చిచ్చుబుడ్డి

భరత మాట ఒంటిపై ఆపాద మస్తకం మరఫిరంగులు మ్రోగుతున్నాయి
శాంతికాముకులారా! అనవసరంగా టపాకాయలు కాల్చి డబ్బు వృధా చేసుకోకండి
దేశం గుండెలు ఛిద్రమై ... ఛిద్రమై
చిచ్చుబుడ్డిలా రక్తపు ధారలను ఎగజిమ్ముతోంది
అడవులు, కొండలు, లోయలు, సముద్రాలు
అభద్రతతో ధ్వనిస్తున్నాయి
తలవంచుకుని నిస్సహాయంగా నడచిపోతున్న శో సగటు మనిషిని
ముక్కలైన రూపాయి నోట్లను అప్పతెచ్చి అలికించిన జలతారు జండాలు,
"శివకాశి" ప్రేలుళ్ళలోకి తరుముతున్నాయి-
కన్నీటిని తుడుచుకుంటూ, చిరిగిన నిక్కరును సర్దుకుంటూ
పసి చేతులు తయారించిన దీపావళి టపాకాయలు
ఏర్ కండిషన్డ్ బంగళాల ముంగిట్లో "హృదయాలై" ప్రేలుతాయి-
కుక్కలకంటే హీనంగా కోటి నరకులై శాసనసభల్లో కుమ్ములాడుకుంటూ
దేశాన్ని పార్లమెంటు స్తంభాలకు రెక్కలు విరిచి కట్టేసి
అమ్మేస్తున్న కుల,మత, దురహంకార రాక్షసజాతిని
సజీవ దహనం చేసేందుకు ఈ కాళరాత్రి
ఈ నిర్మానుష్యంగా వున్న కూడలిలో నీకు అందించేందుకు
లిబర్టీ మాతలా చేతిలో "కాగడా"తో ఎదురు చూస్తున్నాను -తమ్ముడూ!
రా! ఈ చీకటిని తుదముట్టించు...

— అనూరాధ సత్రాజు



అతను కాసేపు ఆలోచించి "రేపు సాయంత్రం ఇదే టైమ్‌కి మీ ఫోటోస్ కొన్ని తీసుకొచ్చి చూపించండి" అన్నాడు.

"మద్రాస్ అక్కరలేదాండి."

"ముందు ఫోటోస్ చూస్తాను" అన్నాడతను.

అతనికి థ్యాంక్స్ చెప్పి బయటకి వచ్చింది.

***

ఆకృతి, నీరజ, హర్ష లైబ్రరీ దగ్గర కలిసారు.

"ఏమయ్యాయి పెళ్ళి ఏర్పాట్లు" ఆత్రంగా అడిగింది నీరజ.

"వినోద్ కంటె నీ కెక్కువ తొందరగా వుందేంటి" నవ్వాడు హర్ష.

"మా ఇంట్లోవాళ్ళి పెళ్ళి విషయం ఏమాత్రం పసిగట్టినా ప్రమాదమే. పెళ్ళి అయ్యాక ఎవరేం చెయ్యలేరు. వినోద్‌కి మొండి ధైర్యం. ఇంతకీ ఏం చేసావ్" అడిగిందామె.

"వచ్చే బుధవారం టవున్ హాల్లో నీ పెళ్ళి."

"టవున్ హాల్లో ఏంటి" కంగారుగా అడిగింది నీరజ.

"అవును. టవున్ హాల్లోనే. మంత్రాల నడుమ వినోద్ మూడు ముళ్ళు అందరి ముందు కడతాడు. మీ ఇంట్లోవాళ్ళు, తనింట్లోవాళ్ళు ఎవ్వరూ ఏం గోల చెయ్యకుండా పోలీస్ ప్రొటెక్షన్ తీసుకున్నాం" చెప్పాడు హర్ష.

"దిగులుపడకు. నీ పెళ్ళి ఏ గొడవలూ లేకుండా అయిపోతుంది" హర్ష ధైర్యం చెబుతూంటే ఆకృతి నవ్వుతూ చూస్తూంది.

"ఈ పెళ్ళి అయ్యేవరకు నువ్వు హైదరాబాద్ వెళ్ళకు" నీరజ ఆకృతికి చెప్పింది.

"వెళ్ళను" అంది ఆకృతి.

"హైదరాబాద్ వెళుతున్నారా? ఎందుకు? ఎన్నాళ్ళుంటారు?" ఆత్రంగా అడిగాడు హర్ష.

"ఆఁ ఉద్యోగం కోసం. దొరికితే ఇంక అక్కడే వుండిపోదామని" అంది ఆకృతి.

ఏదైనా పని మీద రెండుమూడు రోజులు వెడుతోందేమో, ఆమె లేని ఈ వూర్లో రెండ్రోజులు గడపాలా అనే దిగులుతో ఆత్రుతగా ప్రశ్నల వర్షం కురిపించిన హర్షకి ఆమె శాశ్వతంగా జీవనభృతికై భాగ్యనగరానికి వెడుతూందని తెలియగానే మరింత దిగులుపడ్డాడు.

"ఇదిగోండి మీ రడిగిన నా కవిత" అంటూ అతనికి పేపర్ అందించింది.

ఆకృతి చేతి వేపు చూసాడు. లేత చేతులు. ఆ చేతిని అందుకొని అలా అలా ఏ వెన్నెల మైదానాలలోకో పారిపోవాలని మనసు తొందరపెడుతూంది. మెదడులోని సంస్కారం వారిస్తుంటే ఆగి నిగ్రహించుకొని ఆమె చేతిలో కాగితాన్ని మాత్రం అందుకొని, ఎదని వూరడించి, యాంత్రిక మర్యాదలోకంలోకి వొచ్చి నిలిచి "ఏ రోజు వెళ్ళేదీ తప్పక చెప్పండి" అన్నాడు.

తల వూపిందామె.


***

రాత్రి పది గంటలు. ఆకృతి ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఫోటోస్టాట్ కాపీలు విడివిడిగా ఫైల్ చేస్తూంది. అరుణ మంచం మీద కూర్చుని ఆకృతి పని ఎప్పుడు పూర్తవుతుందాని చూస్తుంది. రోజూ ఈసరికి అరుణ నిద్రపోతుంది. తనతో ఏదో మాట్లాడాలనే ఎదురుచూస్తూందని ఆకృతి గ్రహించింది.

ఆకృతి ఫైల్ మూసి డయరీ తీస్తుంటే "చాలాసేపవుతుందా" అడిగింది అరుణ.

"ఏమిటి - చెప్పు"

అరుణ తను డైరెక్టర్ని కలవటం నుంచి మొత్తం వివరంగా ఆకృతికి చెప్పింది. ఆకృతికి బోల్డంత ఆశ్చర్యం వేసింది. 'అరుణ తనకి ఇష్టమైంది సాధించడానికి



## ఆబ్సెంట్

సాకార ఆకారమై
కళ్ళముందు లేనిది నువ్వే–
ఎదలో ప్రతిధ్వనిస్తున్నా
ఎదురుగా లేనిది నీ నవ్వే–
ఆకాశమంత శూన్యం
అర్ణవమంత విషాదం
కలగలసి ఏమీ తోచక
ఏం చెయ్యాలో తెలీక
అర్థం అయ్యీకాక
కొండలా గుండెలో నిర్లిప్తం–
రసధునీ ధ్వనిలాంటి నీ నవ్వుల
కిలకిలల్ని దాచుకున్న గోడలు–
తనలో నీ ప్రతిరూపం చూసుకుని
తిలకం దిద్దుకున్నందుకే
గర్వపడిన అద్దం–
సుకేశపు వాసనలతో అలరారిన తలదిండు–
కొల్లలుగా మల్లెలు నీకందించిన ఆ తీగ–
అరవిందం లాంటి నీ అడుగుల స్పర్శకు
పులకించిన ఈ ప్రాంగణం–
నీ వేలి కొసల తాకిడికి వేణువైన జీవితం–
అన్నీ వున్నాయి–
అలాగే వున్నాయి–
ఒక్క నువ్వు – ఎంత మోసం చేశావు
అగరొత్తుల ధూపం
అంతర్ధానమైనట్లు–
రాత్రి వెలిగించిన దీపం
వెలుతురులో వెలవెల పోయినట్లు
మౌనంగా నిశ్శబ్దంగా
కళ్ళముందే కరిగిపోయిన స్వప్నంలా
వెళ్ళిపోయావు–
మనసుల్ని కాక
మనుషుల్ని గుర్తించే
లోకపు హాజరు పట్టీలో నీవు శాశ్వతంగా ఆబ్సెంట్
హృదయంలో శ్రీకారం దిద్దిన
నీ జ్ఞాపకపు స్ఫటిక ఫలకాలే నాకు 'ప్రెజెంట్'

— శైలకుమార్

ఇంతలా కృషి చేస్తుందా? పైకి అలా కన్పించదు. అల్లరి పిల్లలా వుంటుంది అనుకుంది.

అరుణకి చదువుపై ఆసక్తి లేదు. పోనీ ఆమెకి ఇష్టమైన రంగంలోనే స్థిరపడితే రాణిస్తుంది కదా. కాని ఇంట్లో ఒప్పుకోరు కదా. పైగా ఇంతెత్తున ఎగుర్తారు కూడా. ఎలా...'

ఆకృతి ఈ ఆలోచనలతో కొట్టుకుపోతుండగానే విమల, ఆనందరావు ఆ గదిలోకి రావటం,అరుణ విషయం వివరించటం, వాళ్ళిద్దరూ ఆనందంతో అరుణని అభినందించటం జరిగిపోయాయి.

అరుణ హేమమాలినో, శ్రీదేవో అయిపోయినట్టు–ఆమెతో సెట్‌పై, విమానంలో, ఫైవ్‌స్టార్ హోటల్‌లో తను తిరుగుతున్నట్టు విమల వూహాల్లో తేలిపోతుంటే, ఆమె కాల్షీట్స్ చూస్తూ, నిర్మాతల్ని డేట్స్ కోసం తనింటి చుట్టూ తిప్పించుకుంటున్నట్టు ఆనందరావు కలలు కనేస్తున్నాడు.

ఏ విషయంలోనూ ఇంత పెద్ద మనసుతో ఆలోచించని తల్లిదండ్రులు అరుణ సినిమాల్లో వెయ్యటాన్ని ఇంత సంతోషంగా ఆమోదించడం ఆకృతికి కొరుకుడు పడలేదు.

డబ్బు మనిషి జీవితంలో పోషించే పాత్ర ఆమెకింకా తెలియదు.

***

నీరజ పెళ్ళి అయిపోయింది. ఇరువైపు పెద్దలూ ఏ రాద్ధాంతమూ చెయ్యలేదు. పైగా ఇదో ఆదర్శ వివాహంగా వర్ణించి వివరించి పెద్ద విందుని ఏర్పాటుచేసారు.

"కట్నం గొడవ తప్పిందని మా నాన్న తెగ సంబరపడుతున్నాడు. మా మావగారికీ ఇందులో ఏదో లాభసాటిగా కన్పించి వుండాలి. నెమ్మది మీద తేల్తుందా సంగతి" అంది నీరజ నవ్వుతూ.

జీవితం అంటే వ్యాపారమా – అనుకుంది ఆకృతి.

***

హర్షకి తన మనసులో మాట ఆకృతికి చెప్పాలని వుంది. ఆమె హైదరాబాద్ వెళ్ళకముందే చెప్పాలి. ఆమె సహచర్యం కావాలి. ఆమె సౌందర్యం కావాలి. ఆమె హృదయం కావాలి.

ధైర్యం చేసి ఆకృతి ఇంటికి వెళ్ళాడు. అతడిని చూస్తూనే విమల తనూ ఓ కుర్చీలో కూర్చుని అవి ఇవీ మాట్లాడటం మొదలుపెట్టింది. ఆకృతితో అతను కాని, అతనితో ఆకృతి కాని మాట్లాడటం ఆమెకు ఇష్టంలేదని తెలుస్తూనే వుంది.

ఇలా ఎప్పుడైతే పెద్దలు అతిజాగ్రత్తతో కట్టడి చేస్తారో అప్పుడే పిల్లలు రహస్యంగా బయట కలుసుకోవాలనుకుంటారని చాలామంది తల్లుల్లాగే విమల కూడా గుర్తించలేదు.

అతనికి కాఫీ ఇవ్వాలని విమల లోపలికి వెళ్ళగానే "రేపు టవున్‌హాల్ దగ్గరకి రాగలరా" అడిగాడతను.

"రేపు గోదావరికి హైదరాబాద్ వెళుతున్నానండి" అందామె.

"రాలేరా"

ఒక్క క్షణం ఆలోచించి "మూడు గంటలకి వస్తాను" అంది.

అతనితో మాట్లాడాలని ఆమెకీ వుంది. అతడిని విడిచి వెళుతున్నందుకు వెలితిగా అనిపిస్తూందామెకి. కాని కారణం నిశ్చయంగా ఇది అని ఆమెకి తెలియదు.

***

నాంపల్లి స్టేషన్‌లో ట్రైన్ దిగి బయటకి వచ్చింది ఆకృతి. తను ఈ రోజు వస్తున్నట్టు ముందుగా తెలియచేసినా పెద్దమ్మ ఇంటి నుండి ఆమెని రిసీవ్ చేసుకోడానికి ఎవ్వరూ రాలేదు.

ఖాళీ ఆటో కన్పించింది. మీటర్‌పై రెండు రూపాయి లెక్కువ అడిగాడు. ఇల్లు వెతుక్కొని వెతుక్కొని శ్యామల ఇంట్లో ఆకృతి అడుగుపెట్టింది.

"ఇక్కడ ఎవరి కోసం ఎవరూ టైమ్ ఖర్చుచెయ్యలేరమ్మా. అంతా బిజీ. స్టేషన్‌కి ఎవ్వరూ రాలేకపోయారు" అంది శ్యామల.

# ఉనికి



ఆగంతకులెవరూ వెంటపడక పోయినా
పొద్దుట్నించీ పరిగెత్తీ పరిగెత్తీ
పెరట్లో చెట్టు గాలికిందకి
అశాంతిగా చేరిన ఆమె మీదకి
చంద్రుడు ఓదార్పుగా హాయిగా
ఆకులు ఆకులుగా జాలు వారుతాడు

పగటి నీడలు కళ్ళని కప్పేతున్నా
వెన్నెల ఆమె కంటి చూపవుతుంది
ఇంక ఆకాశమంతా ఆమె చూపే
అందరూ కళ్ళుమూసిన ఈ క్షణం ఆమె కన్నుదే
నిద్రపోతూన్న పాటి కళ్ళల్లోకి చూస్తుంది
వాటి మీద పీడకలల చీకటి నీడలు
వెన్నెల రాత్రి మేల్కొని వుండటం
ఓ అద్భుతమైన కల!

తెల్లారగానే
ఆమె కళ్ళ మీదా చీకటి పడుతుంది
అయిష్టంగా రోజూ చేసే
పీడకలల్లోకి నడుస్తుంది

మళ్ళా రాత్రవగానే
హృదయం మేల్కొంటుంది
కీచురాయి కిలకిలారావంతో — అరణ్యకృష్ణ

ఆమె ఇంటి విషయాలు అడుగుతుంటే జవాబు ఇస్తూనే స్నానం పూర్తిచేసింది ఆకృతి.

"ఉద్యోగాలిక్కడ కష్టమేనమ్మాయ్" అంది శ్యామల.

ఆకృతి మాట్లాడలేదు. ఇక్కడికి వచ్చే ముందు శ్రీమాల ఆకృతికి వాళ్ళ చిన్నాన్న ఎడ్రస్ ఇచ్చింది. అతనికిక్కడ ఇన్‌కంటాక్స్ ఆఫీసరుగా వుద్యోగం.

ఆకృతి పదకొండు గంటలకల్లా భోజనం చేసి ఆ ఎడ్రస్ తీసుకొని ఆఫీసుకి వెళ్ళి అతన్ని కలిసింది. ఆకృతి బయోడేటా తీసుకుని ఒక కప్పు కాఫీ ఇప్పించి రెండు రోజుల కొకసారి ఫోన్ చేస్తుండమని చెప్పాడు.

***

హర్షగార్కి,

వచ్చే రోజు మిమ్మల్ని టవున్ హాల్ దగ్గర కలవలేకపోయాను.

ఉద్యోగం వచ్చింది. శ్రీమాల చేసిన సహాయం. నేనింకా రిజిస్టర్డ్ ఆఫీసు చూడలేదు. ఇంటర్వ్యూ హోటల్లో కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది.

ఈ వూరింకా చూడలేదు. ఆఫీసు ఎడ్రస్ చూసీ చూడగానే చప్పున మీరు గుర్తొచ్చారు. ఎంతో ఇష్టమైన పువ్వుల పేరున్న పరిసరాలలో వుద్యోగం రావటం గమ్మత్తుగా వుంది. మీకు ఆఫీసు ఎడ్రస్ రాస్తున్నాను. ఎన్నిసార్లు ఈ ఎడ్రస్ రాసినా ప్రతిసారీ ఎర్రఎర్రని కలల జలపాతాలు కళ్ళల్లో జారుతూనే వున్నాయి.

జాబుకై ఎదురు చూస్తూ
అభిమానంతో,
ఆకృతి

నా ఎడ్రస్:
కె. ఆకృతి,
శ్రీ కెమికల్స్,
గుల్‌మొహర్ అవెన్యూ,
హైదరాబాద్

ఎత్తయిన కొండపైకి సన్నని కాలిబాట. బాట కిరువైపులా గోదారి పాయల్లా తీరైన పచ్చని చెట్లకి ఎర్రెర్రని గుల్‌మొహర్ వూలు. ఆకుల నీడల్లోంచి జల్లులా చిందుతున్న ఉదయపుటెండ. ఆ గుబురు చెట్ల నడుమ బాటకి ఎడమ వేపున రెండో బిల్డింగ్ శ్రీకెమికల్స్.

అవ్యక్తరాగాలేవో నరనరాల్లో కదుల్తుండగా ఆకృతి బిల్డింగ్‌లో కాలుపెట్టింది.

లావుగా, పొట్టిగా, ఛామన ఛాయ రంగులో వున్న ఓ ముప్పై ఆరేళ్ళ స్త్రీ టెలిఫోన్ ముందు ఆకృతికి కన్పించింది.

ఆకృతి టెలిఫోన్ పక్కగా కనిపించిన 'రిసెప్షన్' అని రాసున్న బోర్డ్ చూసి ఆగి ఆమెకి తనని తాను పరిచయం చేసుకొని "ఈ రోజు జాయినింగ్ రిపోర్ట్ ఇస్తున్నాను" అంది.

టిఫిన్ బాక్స్ మూత తీసి ఓ ఇడ్లీని నోట్లోకి తోసుకుంటూ "వెల్‌కమ్" గట్టిగా, కాస్త కఠినంగా అందామె.

ఆమె పేరు సీతాచార్యులు. హైదరాబాద్‌లో నలభై ఏళ్ళ క్రితం స్థిరపడిన తమిళ కుటుంబీకురాలు. పన్నెండేళ్ళ క్రితం వరదాచార్యులని ప్రేమించి పెళ్ళి చేసుకుంది. ఆమెకి ఇద్దరు పిల్లలు.

సీతాచార్యుల చూపులు ఆకృతిని శల్యపరీక్ష చేస్తున్నాయి. ఆకృతికి ఇబ్బందిగా అన్పించి, "అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ ఎక్కడ" అని అడగాలనిపించక తనే వెతుకుతూ బయలుదేరింది.

రెండవ అంతస్థులో 'అకౌంట్స్ డిపార్ట్‌మెంట్' బోర్డు కన్పించింది ఆమెకి. లోపలికి అడుగుపెట్టింది.

హాల్లో వున్న ఫ్యాన్స్ ఫుల్ స్పీడ్‌లో పెట్టి వాటి క్రింద నిలబడి వున్నాడు ఓ కుర్రాడు. ముప్పై ఏళ్ళ వయస్సు. నల్లగా సన్నగా ఐదడుగుల పొడవున్న అతని పేరు ప్రభాకర్. ఆరు నెలల క్రితం అసిస్టెంట్‌గా జాయినయ్యాడు.

షర్ట్‌కి పైనుండి మూడు గుండీలు తీసేసున్నాయతనికి. విపరీతంగా కళ్ళు చిట్లించి ఆమె వేపు చూస్తూ "ఎవరు" అన్నాడు.

ఆమె జవాబు చెప్పబోతుంటే "బాలరాజు కావాలి" అన్నాడో వ్యక్తి గుమ్మంలో నిలబడి.

"ఇంకా రాలేదు" విసుగ్గా అన్నాడు ప్రభాకర్.

"వస్తే కనకారావ్ వచ్చి వెళ్ళాడని చెపుతారా" మర్యాదగా అడిగాడా వ్యక్తి.

"ఇదేమైనా ఎంక్వయిరీ కౌంటర్ అనుకున్నావా? ప్రతివాడూ రావటం, వాడున్నాడా వీడున్నాడా అని అడగటం" గొణుగుతూ తన సీట్లో కూర్చున్నాడు ప్రభాకర్.

కనకారావ్ అయోమయంగా ప్రభాకర్ వేపు చూసి వెళ్ళిపోయాడు.

ఓ ఐదు నిమిషాల తర్వాత ఓ ముప్పై సంవత్సరాల వ్యక్తి వచ్చాడు.

"ఎవరండి"-ఆకృతి వేపు చూస్తూ దేముని పటానికి నమస్కరిస్తూ అడిగాడు.

ఆకృతి చెప్పింది.

ఆమె చెప్పింది ప్రభాకర్ శ్రద్ధగా వింటూ 'నాకు పోటీయా' అనుకున్నాడు.

"నా పేరు గోవింద. అకౌంట్స్ ఆఫీసర్ని" చెంపలు వాయించుకుంటూ చెప్పాడు.

ఇతను తనకో సీట్ చూపిస్తాడని ఆకృతి కాస్త రిలీఫ్‌గా ఫీల్ అయింది. కాని అతడలాంటి ప్రయత్నమేమీ చెయ్యకుండా, కనీసం కూర్చోమని అనకుండా సహోద్యోగులతో కబుర్లలో పడ్డాడు.

ఆకృతికి విసుగ్గా వుంది. బెరుకుగా వుంది. ఇదేం ఆఫీసు? అందరూ అదోలా ప్రవర్తిస్తారేం? విజిటర్లకి కేటాయించిన కుర్చీల వేపు వెళ్ళి ఓ కుర్చీలో కూర్చుంది. ఎవరెవరో వస్తున్నారు. వస్తూనే అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం పడేసి కబుర్లు చెబుతున్నారు.

"చెక్స్ ఏమైనా వచ్చాయా గోవిందా?" హడావిడిగా హాల్లోకి వస్తూ అడిగాడు ఒక పెద్దమనిషి.

అతను జి.ఎం. (ఫైనాన్స్) అని ఆకృతికి అర్థమయింది. పేరు నర్సింహరావు.



## జీవుని వేదన

ఆశించిన ఫలమందకుండానే
నడి వయస్సులోనే నూరేళ్ళు నిండితే
దుర్విధి విధానమా?
కర్మ పరిపాకమా?
ఆశించును జీవుడు
శాసించును దేవుడు!
విస్తరివేసి మృష్టాన్నం వడ్డించగానే
ఆరగించి ఆనందించడానికారాటం!
సిద్ధమాయెనమ్మా
అడ్డ గించెబమ్మా!
పండబారిన పొలమెండ బారింది
చేతికందిన కబళం వాతికందక పోయింది
అదిగో అదిగో అందుకొందామన్న ఆరాటం
హఠాత్తుగా కొన్ని గంటలు మృత్యువుతో పోరాటం!
'గుండె గొంతుకలోన
కొట్లాడుతుండ'గా
గునపాలతో కుమ్మినట్లు
నివారింపలేని గుండెపోటు!
అనిర్వచనీయమైన జీవునివేదన
అంతులేక మిగిలింది ఆవేదన!
పానకంలో పుడకలా దుర్విధి
పక్షి ఎగిరిపోయె వీడి పెన్నిధి!
ప్రసన్న గంభీర ముఖ ముద్ర సుషుప్తి
అన్నిటినీ అధిగమించిన అమిత సంతృప్తి!
ఏమిటి జీవిత పరమార్థం?
ఏమిటి జీవితాంతర్యార్థం?

— ప్రొఫెసర్ ఎస్. గంగప్ప

"మూడు డి.డి.లు, ఆరు చెక్స్ వచ్చాయండి"వినమ్రతతో చెప్పాడు ఆ గోవింద అన్న మనిషి.

"ఏంటీరోజు బాలసూర్యం రాలేదా" అడిగాడు ప్రభాకర్.

"ఏమో" అన్నాడు అటెండర్ సోమయ్య.

"ఈ రోజు రావని చెప్పారేమో పర్సనల్ డిపార్ట్‌మెంట్‌లో అడిగొద్దాం" హడావిడిగా అన్నాడు నర్సింహారావు.

డిపార్ట్‌మెంట్ మొత్తం అతని వెంట కదిలింది.

ఐదు నిమిషాల్లో తిరిగి అంతా బిలబిలమంటూ హాల్లోకి వచ్చేసరికి "బాలసూర్యం ఇవాళ గంట లేటుగా వస్తానని పర్చేస్ ఆఫీసర్‌కి నిన్న లంచ్ అవర్‌లో చెప్పారంట" అన్నాడు రామానుజం.

అతను పర్చేస్ డిపార్ట్‌మెంట్‌లో టైపిస్ట్.

"అదిగో మాటలోనే వచ్చేసారు" అన్నాడు ప్రభాకర్.

'ఇదేం ఆఫీసు? ఒక అసిస్టెంట్ గంట పర్మిషన్ పెట్టినప్పుడు ఇమీడియట్ బాస్‌కి చెప్పాలి. లేదా డిపార్ట్‌మెంట్‌లో ఎవరికైనా చెప్పాలి. మరో డిపార్ట్‌మెంట్‌వాళ్లకి నిన్న లంచ్ అవర్‌లో చెప్పడమేంటి? వీళ్లందరూ మూకుమ్మడి ఇతని కోసం ఓ గంటసేపు గాలించడం ఏంటి? ఆ మనిషొచ్చాక అయినా 'ఎందుకు ఇన్‌ఫామ్ చెయ్యలేదు' అని ఒక్కరూ అతడిని అడగకపోవడం ఏంటి?'

"జిఎంఎఫ్ వున్నారా" పరిగెడుతూ సీతాచార్యులు వచ్చింది.

"ఉన్నారు ఏం" అడిగాడు వరదవర్మ.

క్యాబిన్ వేపు వెళ్లబోతున్న ఆమె ఒక్కవుదుటున బాలసూర్యం టేబిల్ దగ్గరకి వచ్చి "బాలసూర్యం! ఇదిగో ఫ్లైట్ టికెట్స్ కాన్సిల్ చేసాం. ఇది మార్కెటింగ్ మేనేజర్‌వి. ఇది మిసెస్ ప్రతిభవి. యుటిలైజ్డ్" గట్టిగా అందామె.

"ప్రతిభ అంటే" సందేహంగా అడిగాడు గోవింద.

"జిఎం మార్కెటింగ్ భార్య" అన్నాడు వరదవర్మ.

"ఇదేదో కుంభకోణమే. ఎవరైనా భార్యని సొంత ఖర్చుపై విమానంలో తీసుకువెళతారంటారా" అన్నాడు బాలసూర్యం.

"ఏడిసినట్టుంది. తేనె తీసేవాడు చేతిని నాకకుండా వుంటాడా" వెకిలిగా నవ్వుతూ అంది ఆపరేటర్. మళ్లీ చటుక్కున కదిలి "ఆ నేపోతున్నా బోర్డ్ వదిలొచ్చాను" హాల్లో నుండి జిఎం(ఎఫ్) క్యాబిన్‌లోకి పరిగెడుతూ అందామె.

కూర్చుని కూర్చుని విసుగుపుట్టి ఆకృతి నర్సింహారావు క్యాబిన్‌లోకి వెళ్లింది.

అతను విషయం తెలుసుకుని ఎక్కడ కూర్చోవాలో వివరించి సోమయ్యని పిలిచి ఆ సీట్ ఆమెకి చూపించమన్నాడు. ఆకృతి అతనికి థ్యాంక్స్ చెప్పి సోమయ్య చూపించిన సీట్‌లో కూర్చుంది.

'ఉమెన్ వర్కింగ్ ఫోర్సులో నేనూ ఓ భాగమనే ఆనందం తప్ప ఈ కొత్త వాతావరణం మత్తుగా– గమ్మత్తుగా లేదు. నాకో పూలమాల వేసి ఆహ్వానించక్కర్లేదు. డిపార్ట్‌మెంట్ హెడ్ సీట్ చూపించి, తోటి స్టాఫ్‌ని పరిచయం చెయ్యొద్దా? చెయ్యాల్సిన పనిని వివరించొద్దా? ప్రతి చోటా ఇలాగే వుంటారా? ఖచ్చితంగా ఇలా వుండరు. ఇక్కడ పునాదిలోనే ఏదో లోపం వుంది. లేకపోతే ఇతరుల గురించి అసభ్యంగా మాట్లాడరు. టాప్ లేచిపోయేట్టు ఆపరేటర్ అరవదు. నేనిక్కడ పని చెయ్యగలనా!'

** ** ** **

ఆకృతి వివిధ భారతిలో పాటలు వింటూ చీరలు ఇస్త్రీ చేస్తోంది. ఆఫీసులో జాయిన్ అయి వారం అయింది.

"ఆఫీసు ఇంటికి చాల దూరం కదమ్మా" అడిగింది శ్యామల.

"దూరమే" అంది ఆకృతి.

"బస్సు ఛార్జీలు చాలా అవుతాయి కదా... దగ్గరగా రూమ్ తీసుకుంటే హాయి!"

ఆకృతికి ఆశ్చర్యమేసింది. శ్యామల ఇలా వేరే వెళ్లిపొమ్మని చెపుతుందని వూహించలేదామె. ఆ రాత్రే తల్లికి శ్యామల ప్రతిపాదన గురించి ఉత్తరం రాసింది. అడ్రస్ రాస్తుంటే హర్ష తనకింకా జవాబు రాయలేదని గుర్తొచ్చింది. అతనిలాంటి సాహిత్యాభిమాని ఒక్కరూ ఇక్కడ దొరకలేదు.

** ** ** **

ఆఫీసు చేరి సంతకం పెట్టి పక్కకు తిరిగిన ఆకృతికి ఓ అమ్మాయి చక్కగా నవ్వుతూ కన్పించింది. తనకంటె మూడు నాలుగేళ్లు పెద్దదై వుండవచ్చు. చామనఛాయ, మంచి పొడవు. అతి తక్కువ అలంకరణలో వుంది.

"నా పేరు రాగమణి. మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్‌లో స్టెనోని. ఇన్నాళ్లూ

లీవ్‌లో వున్నాను. మీరు జాయిన్ అయ్యారని తెల్సి వచ్చాను పరిచయం చేసుకుందామని" గలగలా నవ్వుతూ అందామె.

ఆకృతి స్నేహపు నవ్వు నవ్వింది. ఆ అమ్మాయి "మీకింకా ఈ ఆఫీసులో అమ్మాయిలెవ్వరితో పరిచయం కాలేదనుకుంటాను ఒక్క సీతాచార్యులతో తప్ప" అంటూ నవ్వింది.

"మీకెలా తెల్సు"

"రిసెప్షన్ అని బోర్డు చూసి మహోవుత్సాహంగా ఆమె దగ్గరికి వెళ్లతారు ఆఫీసులో అడుగుపెట్టేవాళ్లంతా. ఈడ్చి తన్నినట్టు వెనక్కి వచ్చేస్తారు. మా డిపార్టుమెంట్‌కి రండి లంచ్ అవర్‌లో- అందర్నీ పరిచయం చేస్తాను" అంది రాగమణి.

"అలాగే" అంది ఆకృతి.

తొమ్మిది అవుతుండగా ఎవరి సీట్లకి వాళ్లు వెళ్లారు.

లంచ్ అవర్. ఆకృతి మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్‌లోకి వెళ్లింది. సేల్స్ రిప్రజెంటెటివ్‌లు, మేనేజర్లు, ఆఫీసర్లు, స్టెనోలు, టైపిస్టులు, అసిస్టెంట్‌లు, కస్టమర్లు, డీలర్లతో కోలాహలంగా వుందా డిపార్ట్‌మెంట్.

దాదాపు అందరి చూపులూ ఆకృతిని అంటుకుపోయాయి. ఆమె అందం అటువంటిది.

ఆకృతిని చూడగానే రాగమణి నవ్వుతూ ఎదురొచ్చి "రండి రండి. ఇదే మా డిపార్ట్‌మెంట్. మార్కెట్‌కి అచ్చు తెలుగు అర్థంలా బజారులా వుంటుంది" అంది.

"బజారు తెలుగు పదమా" అంది ఆకృతి.

రాగమణి ఒక్క క్షణం మౌనంగా అయిపోయి "మీరు తెలుగువారా" అని తెలుగులో అడిగింది.

"ఆ" అంది ఆకృతి.

ఆఫీసులో అంతా ఇంగ్లీషు, హిందీలోనే మాట్లాడతారు. కాస్త తమిళం, కన్నడం కూడా వినిపిస్తుంటుంది. మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్‌లో తమిళులు ఎక్కువ వున్నారు.

కవిత, భార్గవి వివాహితులు. కవితకి ఒక పాప. సుమన, కరుణ ఇంచుమించు తన వయసే. ఒక్క సీతాచార్యులు తప్ప అందరూ ముప్పైఏళ్ల లోపువాళ్లే. అందరిదీ సామాన్య రూపం.

రాగమణి తప్ప మిగిలిన వారందరి కళ్లలో ఆకృతి సౌందర్యం పట్ల రవ్వంత అసూయ కనిపిస్తోంది. అటువంటి చూపులు ఆకృతికి ఊహ తెలిసినప్పటి నుంచి మామూలే. కాసేపు గడిపి వచ్చేసింది. ఆఫీసులో అంతా తనకి గర్వమని అనుకుంటున్నారని ఆమెకి తెలియదు.

ఆకృతిగార్కి,

కైసేహై ఆప్... ఔర్ ఆప్‌కా గుల్‌మొహర్? నా స్వప్న ప్రపంచమూ అందులోని వ్యక్తులూ అంతా క్షేమము.

విజయవాడ నుంచి వచ్చేప్పుడు లతపుస్తకం 'ఆదిమధ్యాంతాలలో' తెచ్చుకున్నాను. అరుదైన అద్భుతమైన నవల. మీరు చదివారా?

బుచ్చిబాబు 'చివరకి మిగిలేది' తర్వాత నన్నంతగా కదిలించిన నవల ఇది.

మీరన్నది నిజమే. మనకిష్టమైన వాళ్ళు లేకపోతే అది ఎంతటి సుందరమైన ప్రదేశమైనా ఎడారే అవుతుంది.

ఇక్కడ మాబడి బాగుంది.

కాస్త సహనమూ, సున్నితమైన మనసు వుండాలే కాని బడిలో పిల్లల మాటల్ని, పాటల్ని ఎంచక్కా ఎంజాయ్ చెయ్యచ్చు. బలవంతంగానైనా విద్య నేర్పి పిల్లలను విజ్ఞానవంతులుగా(???) తయారు చేద్దామనుకుంటేనే సమస్య మొదలవుతుంది. చదువో... చదువూ... అంటూ పిల్లల్లోని అమాయకత్వాన్ని, స్వేచ్ఛాపిపాసని ధ్వంసం చేస్తున్నాం.

తాటి చెట్టుపై నుండి కల్లుగీసే వ్యక్తి పాడే పాట... బడలికతో మెల్లిగా విస్తరించే సాయంకాలపు నీరెండలో ఇంటికి తిరిగొచ్చే పల్లె అమ్మాయిలు...

గోగుపూలను చూసారా? సాయంకాలపు ఆకాశంలోని అరుణిమ ఫ్రీజ్ అయి పూలుగా మారినట్టుంటాయ్.

పశువుల్ని కాసే మా బడిపిల్లలు వారి అనుభవాల్ని చెపుతుంటే ఈర్ష్య బాధ కలుగుతాయి. నా బాల్యాన్ని బడి తినేసిందనే కోపం కూడా!

ఇంక ఆపేయనా?

కొద్ది రోజుల్లో హైదరాబాద్ రావాలని, వచ్చి వుండిపోవాలని వుంది. నాలోని నిర్లిప్తతని నిరాసక్తతను, జడత్వాన్ని వదిలేసుకుందామని... జవాబు రాయండి. ఎడ్రెస్ రాస్తున్నాను.

మీ

హర్ష

ఎంతసేపలా కూర్చుందో ఆమెకే తెలియదు. హర్ష ఆమెకి రాసిన తొలిఉత్తరమది.

** ** **

గులమెహర్ పూలని కళ్ళలో దాచుకుని వుషారుషారుగా అటెండన్స్ రిజిస్టర్‌లో సంతకం పెట్టి డిపార్ట్‌మెంట్ వేపు కదిలింది ఆకృతి. హర్ష రాసిన కబుర్లే మనసంతా పిల్ల తిమ్మెరలా!

"శ్రీకర్ స్కూటర్ ఎక్కారా" సీతాచార్యులు ప్రశ్నతో ఉలికి పడింది.

"ఊ"

"ఎందుకెక్కారు" వ్యంగ్యంగా అడిగింది.

ఆకృతి కళ్ళెత్తి చూసింది. ఏమిటీమె ధోరణి?

"ఎందుకెక్కారు" సీతాచార్యులు రెట్టించింది.


ఆకృతికి చిర్రెత్తుకొచ్చింది.


"నా విషయాలలో జోక్యం చేసుకోకండి" కసీమని నిర్మొహమాటంగా చెప్పింది.

## అర్థం కాని పద్యం

అర్థంకాని
పద్యాలు రాయడంలో
రెండు సుఖాలున్నై
వొకటి
మహా మహా విమర్శకులైనా
రాళ్ళు విసరడానికి
తెగజంకి పోతారు
రెండు
ఏమి రాసామా
అని వెనక్కి చూసుకుని
మన మీద మనమే
బోల్డు జాలిపడి పోవచ్చు
మనకే అర్థం కావి సెల్ఫ్‌పిటీతో.

– నారాయణస్వామి





# కొత్తవారసత్వం

రూపాయికంటె చిన్నదైనా
దేశంకన్నా మా అమ్మ పెద్దదే
తొమ్మిది నెల్ల 'అజ్ఞాతం' తర్వాత
ఒకరికొకరం పరిచయ మయ్యాక
మామధ్య మౌనస్పర్శ మేల్కొనేది
మా మధ్య ద్రవభాష స్రవించి ప్రవహించేది
మా అమ్మతీగకు పూసిన పరిమళ పుష్పాన్నప్పుడు
ఆమె ఒడిలో స్వప్నించిన స్వర్గ సుతుణ్ణి కూడా
దేశంకన్నా మా అమ్మ అమాయకమైందే కనుక
నా అవ్యక్త బాధలకు అర్థాలు వెతికేది
హద్దుల్లేని ఆటల్తో
అమ్మని కూడా ఆడే చెండులా ఆడిస్తుంటే
పసినవ్వులోకమై పరిగెత్తు కొచ్చేది
ఆమెకున్న ఏకాంత సంభాషణంతా నేనే

మాటల్రాని చేతల్తో
కలయ దిరిగే కాళ్ళతో
అలసిన అవయవాల ఆవలింతల్తో
అమ్మపాన్పుమీద
నా బాల్యమలా స్వర్గధామమయ్యేది
ఇప్పుడు—
మృత్యు సమీపానికి అమ్మా యవ్వనాంతంలోకి నేనూ వచ్చేశాం
నేను సంసారపు జట్కాబండీకి కట్టిన ఒంటి గుర్రాన్నై పోయాను
తడారని తల్లివాత్సల్యం తలదించుకు వెళ్ళిపోయింది
రూపాయి కోతలో రెండు తలువు చెక్కలమై పోయాం
రెండుపాలచుక్కల్ని పొదిగిన విందు నీళ్ళ గ్లాసై పోయాం
విలువల విక్రయానికొద్దిన సరుకులమైపోయాం
రూపాయి కాగితం తెరవిద ఆడించే తోలుబొమ్మలం
మమ్మల్ని పలకరించే సుఖ దుఃఖాలు మావికావు
మమ్మల్ని వేటాడే రూపాయి భోగాలివే
అప్పుడప్పుడూ మమకారం ముంగిట్లో
కప్పల్లా బెకబెకమంటూ వుంటాం
గుక్కెడనుబంధాల్లేని ఎడారి ఇసుక గూడుమాది
రూపాయి రూపమెత్తిన సంబంధాలు మావి
డబ్బు దేహాత్మలు మావి
అమ్మా! నన్నుకన్న నీలానే
ఈ నేతల్లి కంటున్న రూపాయి సంస్కృతికి
నేటి వారసులం మనమే.

— నాళేశ్వరం శంకరం

"అది కాదండి. మీరలా వెళ్ళటం వరదవర్మ చూసాడు. నేనూ చూసాను. నేనేం అనుకోలేదు. కాని వరదవర్మ మీకు శ్రీకర్‌కి మధ్య ఏదో వుందంటున్నారు. మనం ఆడాళ్ళం. మన జాగ్రత్తలో మనం వుండాలి" అందామె.

ఆకృతికి చిరాకేసింది. 'వాడేదో వాగాడని ఈవిడేంటి ఇంత పనిగట్టుకొచ్చి మరీ చెపుతుంది!'

ఆడ, మగ అనేసరికి ప్రతివారికీ శృంగారమే గుర్తొస్తుంది. అయ్యో! ఎంత చులకనైపోయిందీ బంధం.

"హాయ్" అంటూ వచ్చిన రాగమణిని చూడగానే సీతాచార్యులు విసురుగా వెళ్ళిపోయింది.


"ఏంటంటా తల్లి రుసరుసలు" అడిగింది రాగమణి.

"నిన్న బస్టాప్ దగ్గర బస్సుకోసం ఎదురుచూస్తుంటే శ్రీకర్, అదే మీ డిపార్టుమెంట్‌లో సేల్స్ రిప్రజెంటేటివ్ లేరూ—అతను కనిపించి కోఠి దగ్గర డ్రాప్ చేస్తానంటే వెళ్ళాను. అదీ గోల" అంది ఆకృతి.

రాగమణి గట్టిగా నవ్వింది.

ఆకృతికి చప్పున తను ఇల్లు మారాలనే విషయం గుర్తొచ్చింది.

"నాకో రూమ్ కావాలి" అంది ఆకృతి. "ఒక ఆదివారం ఉదయమే ఇంటి నుండి బయలుదేరి ఖైరతాబాద్ బస్టాప్ దగ్గరకిరా. నేనూ వస్తాను. వెతుకుదాం" అంది రాగమణి.




ఆ సాయంత్రం. ఆకృతి ఇంటికి వెళ్ళేసరికి విమల ఎదురొచ్చింది.

"ఎప్పుడొచ్చావమ్మా" అడిగింది ఆకృతి.

"ఉదయం. అప్పటికే నువ్వెళ్ళిపోయావ్. భారతాంటీ కూతురు పెళ్ళి" అందామె.

విమల, భారతి బాల్య స్నేహితులు. చదువు—పెళ్ళి—వూరు మార్పు—పిల్లలు—జీవితాలలో మార్పే తప్పా వాళ్ళిద్దరి స్నేహంలో మార్పు లేదు.

అటువంటి స్నేహాలు ఈతరంలో చాలా తక్కువ. కొన్నాళ్ళు పోతే అవసరాలకి మాట్లాడుకునే బంధమే తప్ప అస్సలు స్నేహితులే వుండరేమో.

"అరుణ ఎలా వుందమ్మా? తీసుకు రాలేదేం?"

"నాన్నగారు, అరుణ మద్రాస్ వెళ్ళారు. సినిమాల్లో ఛాన్స్ కోసమని ఇంకా ఎవ్వరికీ చెప్పలేదు." అంది విమల.

** ** **

ఉదయం పది.

ఆకృతి ఆఫీసు పనిలో పూర్తిగా మునిగిపోయి వుండగా "మేడమ్" అని వినిపిస్తే చేస్తున్న పనిలో నుంచి తల కూడా తిప్పకుండా "ఊ" అంది.

"హి ఈజ్ మిస్టర్ కిరణ్‌చంద్ర" చప్పున తలెత్తింది. పర్సనల్ ఆఫీసర్ మాధవన్. అతని పక్కనే మరో యువకుడు. ఇరవై ఎనిమిదేళ్ళు వుంటాయేమో. చిరునవ్వుతో చూస్తున్నాడు. మనిషి అందంగా, హుందాగా, దాబుగా వున్నాడు.

ఆకృతి చుట్టూ చూసింది. అకౌంట్స్ స్టాఫ్ హాల్లో నిలబడి వున్నారు. జి.ఎం.

(ఫైనాన్స్), అకౌంట్స్ ఆఫీసర్ వాళ్ళ వాళ్ళ చాంబర్స్ బయట నిలబడి వున్నారు. మాధవన్ పరిచయం చేస్తున్న వ్యక్తి ఎవరో పెద్దవాడై వుండాలి. లేకపోతే అందరూ ఇంత మర్యాదగా చాంబర్స్ బయటకి వచ్చి నిలబడరు.

ఆమె లేచి నిలబడకముందే ఆ వ్యక్తి చేతులు జోడించి ఆమె పక్కసీట్ వేపు తిరిగిపోయాడు. ఆమె ఇంక నిలబడే ప్రయత్నం చేయలేదు. వాళ్ళు వెళ్ళిపోయారు.

ఓ అరగంట తర్వాత "జి.ఎం. మార్కెటింగ్‌ని పరిచయం చేస్తుంటే మీ సెక్షన్‌లో ఎవరో సరిగ్గా రెస్పాన్స్ ఇవ్వలేదంటగా" అంటూ సీతాచార్యులు వచ్చింది.

"ఎవరన్నారు" అడిగాడు ప్రభాకర్.

"పర్సనల్ ఆఫీసర్"

"ఎవరితో"

అమె జవాబు చెప్పలేదు.

"ఆయన ఏమన్నారు" ఆత్రంగా అడిగాడు వరదవర్మ.

"ఎం.డి.కి కంప్లయింట్ చేస్తానన్నాడు. సరిగ్గా రిసీవ్ చేసుకోనిది ఎవరు" కుతూహలం నటిస్తూ అడిగింది.

ఆ వ్యక్తి ఆకృతి అని సీతాచార్యులుకి తెలుసు. ఆమెను బెదరగొట్టి చూడాలనే పైశాచిక ఆనందం.

"పెద్దవాళ్ళతో నమ్రతగా వుండాలండి. లేకపోతే ఇవే గొడవలు! నేనెంత టెన్షన్‌లో వున్నా కొందరిలాగా పరధ్యానలో అయోమయంగా వుండను. ఆఫీసుని నిర్లక్ష్యం చెయ్యను" గొప్పగా అందామె.

అకారణంగా బోర్డుని వదిలి ఇలా డిపార్ట్‌మెంట్స్ చుట్టూ తిరగడాన్ని ఏమంటారో ఆమె భాషలో!

ఆకృతికి అన్నీ వినబడుతున్నాయ్ కాని తలెత్తలేదు.

వరదవర్మ ఆపరేటర్‌కి ఆ వ్యక్తి "ఆకృతి" అని సైగ చేశాడు. ఆమె వెళ్ళిపోయింది.

ఓ పది నిమిషాల తర్వాత రాగమణి వచ్చి "ఎం.డి. వరకు ఎందుకు? మీరే ముందుగా వెళ్ళి అపాలజీ చెప్పేయండి" సలహా ఇచ్చింది.

"నేనేం తప్పు చెయ్యలేదు. ఏం చేసుకుంటారో చేసుకోమనండి. నేనేం అపాలజీ చెప్పను" అందామె.

ఆకృతికి భయం వెయ్యటం లేదు. ఏమవుతుంది. పోతే వుద్యోగం పోతుంది. అంతేగా! ఇదికాకపోతే మరొకటి! ఏ యంత్రాల మధ్య పనైతేనేం యాంత్రికంగా బ్రతకడానికి!

ఒకరోజు లంచ్ అవర్‌లో "రూమ్ వెతకడానికి ఈ ఆదివారమేనా వస్తారా" అడిగింది రాగమణి.

"వస్తాను"

"ఏంటో ఒకే ఆఫీసని పేరుకే కాని రోజూ ముఖాలు చూసుకోటానికే టైముండడం లేదు" అంది రాగమణి.

"చేసే వాళ్ళకి వూపిరి తీసుకునే తీరికే వుండదు. చెయ్యని వాళ్ళకి ఆటవిడుపే" అంది ఆకృతి. తన సెక్షన్‌లో పని ఎగ్గొట్టి గంటల తరబడి కబుర్లు, నవ్వులూ చూస్తూనే వుందామె.

"కిరణ్ చంద్ర విషయంలో ఎం.డి. నిన్ను పిలిచారా?"

"లేదింకా ... ఈ మధ్య సాయంత్రం కన్పించట్లేదేం బస్టాప్‌లో?" అడిగింది.

"పనెక్కువుండి రోజూ సాయంత్రం ఆలస్యంగానే ఇంటికి వెళ్ళాల్సి వస్తోంది" అంది రాగమణి, మళ్ళీ తనే "ఏం వుద్యోగాలో ఏంటో. వెధవది ఏ జన్మలో ఏ పాపం చేశామో ఈ ప్రైవేట్ వుద్యోగాలు చెయ్యాల్సి వస్తుంది" విసుగ్గా అంది.

"ఏమయింది?"

"తొమ్మిదింటికి వస్తే ఐదింటి వరకు వంచిన తలెత్తకుండా పని చెయ్యాలి. పైగా వారంలో ఆ రు రోజులూ లేట్ అవర్స్ చెయ్యాలి. దానికని మనకేమేనా ఒక్క పైసా అయినా ఎక్కువ ఇస్తారా? మా పక్కింటమ్మాయిది గవర్నమెంట్ వుద్యోగం. ఎప్పుడు వెళ్ళినా అడిగే వాళ్ళుండరు. ఎప్పుడైనా తిరిగి రావొచ్చు. బోల్డన్ని సెలవులు. మెటర్నిటీలీవ్. అన్నిటికి మించి ఉదయం ఆఫీసు టైమ్‌కి,



## అరణ్యాం

ఒక అపురూప గ్రంథాలయంలో వుంటాం
ఒక హరిత సముద్ర గర్భంలో వుంటాం
ఆకు ఆకులో ఒక ఆహ్లాదం
పువ్వు పువ్వులో ఒక రహస్యం
విస్మృత బాల్య గుప్తనిధి అరణ్యాం
ఆకుపచ్చని ఆరాటం అరణ్యాం
ఒక చైతన్యం విప్పకుని, ఒక సుషుప్తి కప్పకుని అరణ్యాం
అక్కడ ఒక తృప్తి మనల్ని నిలదీస్తుంది
ఒక భారం మనల్ని బాధిస్తుంది
ఒక నిరామయ నిష్పాచీతో మనం పేచీ పడతాం
పట్టి అరచినపుడు అరణ్యాం కదుల్తుంది
గాలి వీచినప్పుడు అరణ్యాం గలగలలాడుతుంది.
వర్షం వచ్చినప్పుడు అరణ్యాం ఆహ్లాద నృత్యం చేస్తుంది.
వసంతం వచ్చినప్పుడు అరణ్యాం అప్సరసల్ని కూడా ఆకర్షిస్తుంది.
చెట్టుపైనించీ చెట్టుకి బంతుల్లా పిట్టలు ఎగురుతాయి.
దిగంత విశ్చలనంలో ఒక దివ్యకాంతి జననంలాంటి చంద్రుడు
లోయలకీ శిఖరాలకీ మధ్య లోలకంలా కదుల్తాడు
నక్షత్రాలు మాట్లాడుతాయి.
వృక్షాలూ బదులిస్తాయి.
రహస్య సందేశాల్తో నిండిన రాత్రి, ఆకాశానికీ, అరణ్యానికీ వార్తాహరుల్ని
పంపుతూనే వుంటుంది.

అరణ్యాం మధ్యలో నిలబడితే మనం మట్టవుతాం, చెట్టవుతాం
చెట్టు కదిలిస్తే గుంపుగా లేచిన సీతాకోక చిలుకలవుతాం
జింక కళ్ళ వెనక భయద సముద్రాలు చూడగలిగితే
పావురాయి స్వరంలో దిగులు లోయల ప్రతిధ్వనుల్ని వినగలిగితే
చల్లని, జిల్లనే నీటిలో కషాయ మాధుర్యం రుచి చూడగలిగితే
అరణ్య గ్రంథంలో ఒక పేజీ అర్థమవుతుంది.

—సౌభాగ్య

దీపావళి శుభాకాంక్షలతో

ప్రసిద్ధ–మహత్తర–విలాసవంతమైన

ISI

రిలాక్సాన్

పరుపులు, దిండ్లు

*హాస్పటల్స్‌కు

*హాస్టల్స్‌కు మరియు

*హోటల్స్‌కు


ఎక్కువ అవసరాలకు
(ప్రత్యేక డిస్కౌంటు కలదు)

బ్యాంక్ కార్డులు అనుమతించబడును

మా షోరూములు

ఎస్.ఎం. 6–40/1, దక్కన్‌క్రానికల్ ఎదురు, ఎస్.డి. రోడ్డు, సికింద్రాబాదు. ఫోను: 823725, 825110. షాప్ నం. 32, కుషాల్‌టవర్స్, సిండికేట్ బ్యాంక్ ఎదుట, ఖైరతాబాద్, హైదరాబాద్.

12–2–418/1, గుడిమల్కాపూర్,
మెహిదీపట్నం దగ్గర,
హైదరాబాద్.


సాయంత్రం ఆఫీసు వదిలే టైమ్‌కి ఆర్‌టిసి బస్సు రెడీ. మనకేవీ ఆ ఫెసిలిటీస్" ఆవేదనగా అందామె.

ప్రైవేట్ రంగంలో పని చేసేవాళ్ళకి గవర్నమెంట్ వుద్యోగాలలో కల్పించినన్ని సౌకర్యాలు కల్పిస్తే యువతలో అసంతృప్తి, అనిశ్చిత వుండదు కదా!

"నాన్న వచ్చారు. చెల్లాయిని కూడ తెచ్చారు. బి.ఇడి. ఎంట్రన్స్ రాయటానికి కోచింగ్‌లో జాయిన్ అవుతానంది" అంది రాగమణి.

ఆకృతికి అరుణ గుర్తొచ్చింది. 'ఎలా వుందో? ఏం చేస్తూందో. ఆమె ఆశలు,కోరికలు నిజమవుతాయా?'

***

ఆదివారం ఆకృతి, రాగమణి వీధి వీధి తిరిగారు ఇంటి కోసం.

వెజిటేరియనా – పెళ్ళయిందా – పర్మనెంట్ వుద్యోగమా – రాత్రుళ్ళు ఆలస్యంగా రాకూడదు – స్నేహితులు రాకూడదు – ఏంటి ఆడపిల్లకా గది – వద్దు పెళ్ళి కావాల్సిన అబ్బాయిలున్నారు–

ఆకృతికి ఆశ్చర్యం – నవ్వు. 'ఒంటరిగా జీవించేవాళ్ళు మనుషులు కారా? ఇంటికి ఎవ్వరూ రాకూడదంటే ఎలా కుదురుతుంది?'

ఆకృతికి ఆ రాత్రి నిద్రపట్టలేదు. ఆఫీసు విషయాలు,గ ది దొరకకపోవటం ఆమెకి చాలా అశాంతి కలిగించాయి.

జీవితంలో మనిషికి ఏం కావాలి? ఎందుకింత అశాంతి? చిన్న చిన్న కోరికలు, చిరు చిరు ఆశలే తీరక సమస్యలవుతూంటే పెద్ద పెద్ద కోరికలు – ఆశలు వుంటే జీవితం ఇంకెంత అశాంతిగా వుండేదో?

ఆలోచనలతో తెల్లవారింది. ఆకృతి ఆఫీసుకి బయలుదేరింది. రోజు మెల్ల మెల్లగా గడిచింది. సాయంత్రం అయిదున్నర అవ్వగానే టేబిల్‌పై వస్తువులన్నీ ఎక్కడివక్కడ సర్దేసి విసుగ్గా బయటికి వస్తుంటే "ఆకృతి" అని విన్పించింది.

చప్పున తలెత్తి చూసింది.వేళకాని వేళ పూసిన గుల్‌మోహర్ పువ్వుల్లా చిరునవ్వులు చిందిస్తూ హర్ష.

ఆమె అధరాలపై చిర్నవ్వు గోదారి జలపాతంలా పురికురికింది.

"ఉదయం వచ్చాను" అన్నాడతను.

"ఉదయమే వచ్చి ఇంతాలశ్యంగా రావటమా" చిరుకోపంగా అందామె.

"పనిమీద వచ్చాను. మీ వర్క్ డిస్టర్బ్ కాకుండా ముందు నా పని చూసుకుని ఆఫీసు వదిలే టైమ్‌కి వచ్చాను" అన్నాడతను.

"అవునా" అందామె.

"అవునా' అని ఆమె పలకటంలో ఓ విధమైన సొగసు వుంది. అతనికి ఆమె అలా పలికే తీరు చాలా ఇష్టం.

"ఎక్కడ కూర్చుని మాట్లాడుకుందాం" అడిగాడతను.

ఆమె భావరహితంగా అతని వేపుచూసింది. తను సిటీ ఏం చూడలేదు.

ఇక్కడికి వచ్చినప్పటి నుండి ఇల్లు, ఆఫీసు తప్ప ఇంకేం తెలియవు. లైబ్రరీని చూసింది.కాని వెళ్ళే సమయమే దొరకటం లేదు.

అతను ఆటోని పిల్చి "బిర్లామందిర్" అన్నాడు.

ఇద్దరూ ఆటో ఎక్కారు. బిర్లా మందిరంకి వెళుతూ దారిలో పాలరాతి కృష్ణుణ్ణి చూసి ఆమె రెప్పలార్పటం మర్చిపోయింది.

"యమునా తీరాన - రాధ మదిలోన
కృష్ణుని ప్రేమ కథా-
కొసరి పాడేటి కోరివల చేటి
మనసు నాది కదా" - లోలో శృతి చేసుకుంటూంది.

స్వామి దర్శనం చేసుకొని మెట్లపై ఓ మూల కూర్చున్నారు. విద్యుద్దీపాలకాంతిలో మిలమిలా మెరిసి పోతూంది భాగ్యనగరం.

"ఈ సిటీ ఇంత బాగుంటుందా" ఆశ్చర్యంగా అందామె.

"ఆరేంజ్డ్ బ్యూటీ" అన్నాడతను.

"నేచురల్ బ్యూటీ ఏదటా" నవ్వుతూ అడిగిందామె.

"ఆకృతి"

"నిజంగానే" పసిపిల్లలా సంబరపడుతూ అడిగింది.

చాలా రోజుల తర్వాత కల్సుకున్నారేమో ఇద్దరూ కాస్త చనువుగా, స్వేచ్ఛగా మాట్లాడుకుంటున్నారు.

"ఇంతకీ ఈవూరెందుకొచ్చారు" అడిగిందామె.

"నా వుత్తరానికి జవాబు పట్టుకెళదామని" అన్నాడతను.

"ఏం రాయాలో తెలియలేదు. అంత బాగుంది వి వుత్తరం" నిజాయితీగా చెప్పిందామె.

"దానికి రిప్లై ఇవ్వకపోయినా, మీరు మీ వుత్తరం రాయెచ్చుగా" చిర్నవ్వుతో అడిగాడతను.

అతని వేపు చూస్తూ "ఏంరాయాలో ఎవ్వరూ తెలిసేది కాదండి" అంది.

నగర వాతావరణం ఆమె వేషధారణలో పెద్ద మార్పుని తీసుకు రాలేదు. ఆకృతి ఆకృతిలాగే వుండడం అతనికెంతో తృప్తినిచ్చింది. ఆమెకి ఎంతో శాంతిగా వుంది. కల్లోలం తరువాత గౌతమిలా ఆమె నయనాలలో ప్రశాంతి ప్రవహిస్తూంది.

వాచ్‌వేపు చూసుకుంటూ "వెళదామా" అడిగాడతను.

"ఊ" అందామె.

ఇద్దరికీ ఒకర్ని విడిచి ఒకరికి వెళ్ళాలని లేదు. అయినా వెళ్ళక తప్పదు.

"ఇంతకీ మీరెందుకొచ్చారో చెప్పనే లేదు" కుతూహలంగా అడిగిందామె.

"నా ఫ్రెండ్ వాళ్ళ మదర్‌కి మతిస్థిమితం తప్పింది. హాస్పిటల్లో జాయిన్ చేయటానికి తెచ్చాం" అన్నాడతను.

"జాయిన్ చేశారా"

"ఎలా వున్నారావిడ"

"ఈ వేళేగా జాయిన్ చేసింది"

"మీరెన్నాళ్ళుంటారు"

"తెలియదు. ఈ రాత్రికి హాస్పిటల్లో నేనుండాలి. రేపుసాయంత్రం మీ ఆఫీసు దగ్గరకి వస్తాను" అన్నాడతను.

బస్సు కోసం ఎదురు చూస్తే చాల ఆలస్యం అవుతుందని ఆమె ఆటో ఎక్కి వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళాక అతను ఆటో ఎక్కాడు.


అంతవరకు అతని చేతుల్లో పరిమళించిన వాడిన దవనం అతని ఎదకిదగ్గరగా వున్న జేబులో గుబాళించింది. అది కూర్చున్నప్పుడు ఆమె జడ నుండి జారిపడితే అతను దాచుకుంది.

***

ఆకృతి ఆఫీసులో తన పని సాయంత్రంలోగా అయిపోవాలని త్వర త్వరగా చేస్తూంది.

సాయంత్రం హర్ష వస్తే ఈ మధ్యేం చదివాడో కనుక్కోవాలి. ఎన్నాళ్ళయిందో కమ్మని కవితల గురించి, పసందైన కథల గురించి మాట్లాడుకొని.

"ఈ లేన్‌లో చివరింట్లో అవుట్ హౌస్ ఖాళీ వుందంట. చూద్దామా?"



## కర్తవ్యం

కలలు వద్దు.
కలల్ని ప్రసవించే నిద్ర వద్దు.
పెసిమిస్టుల దోస్తీ వద్దు.
అనుభూతుల అబద్ధాలు అసలే వద్దు
మైలు రాళ్ళను చూడొద్దు -
వెనుతిరగని పోరాటంలో ఆకాశమే నీ హద్దు.
వేదాంతాలొద్దు.
తత్వచింతనా సందిగ్ధావస్థలో పడవద్దు.
ప్రేమ జ్వరాలు వద్దు.
విరహాల ఐస్‌క్రీమ్‌లు వద్దు.
పూదోటల ఛాయలు వద్దు.
నైట్‌క్వీన్‌ల మైకంలో స్పృహ కోల్పోవద్దు.
కాలేజీలు రౌడీల ఫ్యాక్టరీలు-
ఆ చదువులు నీ కొద్దు.
విచక్షణ లేని దేశంలో నీకు గైడెన్స్ లొద్దు.
మనుషుల మధ్య కమ్యూనికేషన్లు తెగాయి.
కన్‌ఫ్యూజన్ కావద్దు.
మానవత్వం మరణించిన దేశంలో
మంచివై వెతకొద్దు.
ప్రాణాల మీద ఎంతో మోజున్న పిచ్చి
నీ మాట ఎలా వింటారో
ఇంకా నిష్ఠురగ వద్దు

\- రఫీ

రాగమణి చిన్నగా ఆకృతికి మాత్రమే వినిపించేలా చెప్పింది.

"ఎప్పుడు చూడాలి?" అడిగింది ఆకృతి.

"ఇప్పుడు చూసొద్దామా"

ఇద్దరూ వెళ్లారు. ఒక గది. అటాచ్డ్ బాత్రూమ్. స్టాండింగ్ కిచెన్. [illegible] మెహర్ చెప్పిన రేటు కన్నా ఆ అవుట్ హౌస్ అద్దెకి వస్తుంది.

"ఎంత" అడిగింది రాగమణి.

ఇల్లు చూపించిన ఆమె అద్దె చెప్పగానే "ఇప్పుడే ఇచ్చేస్తాను" అని పర్సు లోంచి డబ్బులు తీసింది ఆకృతి.

"[illegible]" అడిగింది రాగమణి.

"ఆయనగారు ఆఫీసుకి వెళ్లారు" అన్నాడతను.

[illegible]

రాదు. రాగమణి అడుగుతోంది

## కాలం అంచున

ఒంటి నిండా గాయాలతో
కాలం పయనిస్తూనే ఉంటుంది...
చేజారిన స్వప్నం
గుండెలో నిరంతరం గుచ్చుకుంటూనే ఉంటుంది...
మంచు పా గను ధరించిన శిరస్సు
తలవుల బరువుతో కుంగిపోతూనే ఉంటుంది...

అనుభవాల పొరల్ని కెలుకుతూ
ఓ స్మృతి కెరటం ఎగసి పడుతూనే ఉంటుంది...
చీకటికి వెన్నెల నిచ్చే జాబిలిని
మేఘ సమూహం అడ్డగిస్తూనే ఉంటుంది...
జ్ఞాపకాల వలయంలో హృదయంలా
గగనం గర్జిస్తూ, ఘోషిస్తూఆక్రోశిస్తూనే ఉంటుంది

ఇన్ని
జీవన రహస్య నాదాలను ఆవిష్కరిస్తూ
కాలం అంచుకి చేరుకున్నాం–
నేస్తం, స్నేహం తీయనిదే కాదు
బరువైనదీ, బాధైనదీ
ఉచ్ఛ్వాస నిశ్వాసాల శాసించేదీ కూడా...
ప్రణయం వసంతంలోఉషోదయమే కాదు...
ప్రళయ ఝంఝులో సంగమించే అద్వైతం!!

– ఝాన్సీ కె.వి. కుమారి

"అమ్మగారు లేరా"

"అయ్యగారికింకా పెళ్ళి కాలేదు" అన్నాడతను.

రాగమణి ఆకృతివేపు చూసింది. ఆకృతి అసలా సంభాషణే వినటం లేదు.

"ఓనర్‌కి పెళ్ళి కాలేదంట" అంది రాగమణి.

"అయితే"

"నీకేం భయం లేదా"

"ఎందుకు?"అయోమయంగా అడిగింది ఆకృతి.

"అతను, నువ్వూ ఒంటరివాళ్ళే. ఎవరైనా ఏమైనా అంటారేమో" అంది రాగమణి.

"ష్ ... నువ్వుకూడానా..." ముక్కు చిట్లించి నవ్వుతూ అంటూ అద్వాన్స్ ఇచ్చింది ఆకృతి.

ఇద్దరు ఆఫీసుకి తిరిగొచ్చారు.

***

మధ్యాహ్నం కాలిక్యులేటర్లో సెల్స్ వేస్తుంటే "మేడమ్" అని వినిపించింది.

ఆకృతి తలెత్తి చూసింది. కిరణ్ చంద్ర. పక్కనే పి.ఓ.. కిరణ్ చంద్ర పి.ఓ. వేపు చూశాడు. వీళ్ళిద్దరూ ఇలా రావటం గమనించిన సీతాచార్యులు, ప్రభాకర్, బాల సూర్యం, గణపతి, గంగాధర్ బిలబిలమంటూ ఏదో పనున్నట్టు వచ్చారు.

పి.ఓ. ఒక అడుగుముందుకు వేసి "సారీ" అన్నాడు. ఆకృతికి గొప్ప అయోమయంగా వుంది.

"ఫర్‌వాట్" అందామె.

"ఎం.డి.కి మీ మీద కంప్లయింటిచ్చాను. అతనువైస్ – ప్రెసిడెంట్‌కి ఫరవార్డ్ చేశారు. మీ తప్పేం లేదని, అఫీషియల్స్‌ని నిర్లక్ష్యం చెయ్యలేదని, ఆ టైమ్‌కి మీరు మీ పనిలో నిమగ్నమై వుండడం వలనే అతడిని వెంటనే రిసీవ్ చేసుకోలేకపోయారని కిరణ్ చంద్ర వైస్– ప్రెసిడెంట్‌కి చెప్పారు. తప్పు నాదే" అన్నాడు పి.ఓ.

"ఈ విషయం ఎం.డి.కి రిపోర్ట్ చెయ్యకముందే మీరు చెప్పి అతనిని ఆపించొచ్చుగా" కిరణ్ చంద్ర మొహంలోకి సూటిగా చూసిందామె.

"నేసీ విషయం కిరణ్ చంద్రగారితో ముందే చెప్పి వుంటే బాగుండేది. ఇప్పుడు ఎం.డి.గారు చెప్పే వరకు ఈ విషయం అతనికి తెలియదు" అన్నాడు పి.ఓ.

ఆకృతి మౌనంగా వుండి పోయింది. వాళ్ళ కంప్లెయింటూ బాధించలేదు. క్షమాపణా ఆనంద పరచలేదు. అయితే ఈవ్యవహారమంతా సీతాచార్యులువంటి వాళ్ళని బాగా ఉడికించింది.

హర్ష వస్తాడని, అతడిని చూడాలని ఆఫీసునుండి బయటకి వస్తుంటే "నాన్నమ్మకి బాగోలేదు. హాస్పిటల్లో జాయిన్ చేశారు" పెద్దమ్మ కొడుకెదురొచ్చి ఆకృతికి చెప్పాడు.

ఆమె హర్ష విషయం క్షణం మర్చిపోయి "ఎప్పుడు? ఎక్కడ" ఆత్రంగా అడిగింది.

"రంజనిగారి నర్సింగ్‌హోమ్‌లో మధ్యాహ్నం నీకు ఫోన్ చేశాం. మీ ఆపరేటర్ పెట్టేసింది నీ పేరు వినగానే" అన్నాడతను.

"ఏమయింది నాన్నమ్మకి"

"కడుపులో నొప్పి"

"నడు" అంటూ బస్టాప్ వేపు వెళ్ళబోతుంటే హర్ష గుర్తొచ్చాడామెకి.

ఈ సమయానికి వస్తానన్నాడే ఇంకా రాలేదేంటబ్బా అనుకుంటూ రెండు అడుగులు వేసిందో లేదో కిరణ్ చంద్రకి "థాంక్స్" చెప్పలేదని గుర్తొచ్చింది. రేపుతప్పక చెప్పాలి అనుకుంది. 'రేపటికి నాన్నమ్మ ఆరోగ్యం బాగుపడితే నిశ్చింతగా ఆఫీసుకి రావొచ్చు. కిరణ్ చంద్రకి కృతజ్ఞతలు చెప్పొచ్చు. తర్వాతెప్పుడో తీరుబడిగా చెపితే బాగుండదు. అదీకాక అప్పుడే చెప్పనందుకు అతనేం అనుకున్నారో!

'హర్ష వుంటారో వెళ్ళిపోతారో ఏంటో ... ఇప్పుడే ఈవిడ ఆరోగ్యం చెడిపోవాలా? ఛ...ఛ... ఏంటి పాపం నాన్నమ్మకి ఒంట్లో బాగుండకపోతే ఇలానేనా చికాకుపడేది'– అనుకుంటూ హాస్పిటల్‌కి వెళ్ళింది ఆకృతి.

రెండ్రోజుల తర్వాత ఆకృతి ఆఫీసుకి వెళ్ళింది. వెళ్ళీ వెళ్ళగానే కిరణ్ చంద్రకి థాంక్స్ చెప్పాలని ఆతృతగా అతని డిపార్ట్‌మెంట్‌కి వెళ్ళేసరికి అతను కాంప్‌లో వున్నట్టు తెలిసింది. కంపెనీ పనిపై బెంగుళూరు వెళ్ళాడట. ఆకృతి వుసూరంటూ తన డిపార్ట్‌మెంట్‌కి వచ్చింది.

"మేడమ్. హర్ష అంట. మీకోసం వచ్చారు. వెళ్ళిపోయారని చెపితే తనూ వూరు వెళ్ళిపోతున్నట్టు చెప్పమన్నారు" అన్నాడు సోమయ్య.

'అయ్యో' అనుకుందామె.

***

ఆదివారం ఉదయమే సూట్‌కేసుతో కొత్త ఇంట్లో అడుగు పెట్టింది. ఉత్సాహంగా ఇంటికి కావాల్సిన వస్తువులు కొనుక్కొని సర్దుకుంది. ఇంటి ముందు కుండీల్లో గులాబి మొక్కలు పెట్టింది. ఒక వరసలో చిట్టి చామంతులు వేసింది.

కొత్త ఇంటి ఎడ్రస్‌తో అమ్మకి, నీరజకి వుత్తరాలు రాసింది.ఆమెకి పదే పదే అరుణని చూడాలనిపిస్తోంది. అరుణకి విడిగా ఒక ఉత్తరం రాసి పోస్ట్ చేసింది.

***

ఆకృతి,

*శిశిరంలో కోయిల పాట వినాలనుకోవటం, మీ దగ్గర నుండి వుత్తరం ఆశించటం ఒక్కటే సుమా! ప్రకృతి రూపుదాల్చిన ఆకృతి గోదారి రూపంలో మా ఇంటి పక్క నుండే ప్రవహిస్తుంది.*

*(మిమ్మల్ని గోదారితో పోలిస్తే మీకేమైనా అభ్యంతరమా???)*

*గోదారొడ్డున చిన్న యిల్లు, రామ చిలకల కిలకిలలు, జాజుల పరిమళం చాలా మీకు? ఇటువంటి కోరికలు కోరుకుంటే ఈ కంప్యూటర్ యుగంలో తీరవు. ఓ బంగళా, కారు, బొచ్చుకుక్కపిల్లలు, పర్సనల్ కంప్యూటర్ కోరుకోండి. సిటీలో తినే తిండిని కూడా కంప్యూటరే నిర్దేశించేంత అభివృద్ధి. పల్లెల్లో కరెంట్ కూడా లేని పేదరికం. మీరీ వూరు వస్తే వుండగలరా?*

*మట్టి రోడ్లు, కరెంట్ లేని ఇళ్ళు, కుండలలో నీళ్ళు. ఏమో మీరీ దేశపు పేదరికం అంతా పల్లెల్లోనే చూడొచ్చు. రమ్యమైన ప్రకృతి నిండిన పల్లెల్లో కనీస సౌకర్యాలు వుంటే ఇంకా సౌకర్యంగా, శాంతిగా జీవించొచ్చు. ఇంతకీ మీరెప్పుడా*

స్తారు? మీరొచ్చే వరకు జాజిపూల తీగల్ని, సంపెంగ పొదరిళ్ళని సేకరించి మా ఇంటి ముంగిట అలంకరిస్తుంటాను.

మీరొచ్చేనాటికి నాతోపాటు జాజిపూలు, సంపెంగలు మీకు స్వాగతం చెపుతాయి.

వస్తారని వూహిస్తూ,

హర్ష

చదవటం పూర్తిచేసిన ఆకృతి అధరాలపై అందమైన నవ్వు కదిలింది. ఏం రాయాలీ కుర్రాడికి? ఇంతలో ఆమెకి ఆ రోజు కిరణ్ చంద్ర పార్టీకి పిల్చిన విషయం గుర్తొచ్చింది. ఉత్తరం చలం 'ప్రేమ లేఖలు' పుస్తకం మధ్యలో పెట్టి త్వరత్వరగా ముస్తాబై చెప్పిన స్టార్ హోటల్‌కి బయలుదేరింది.

రంగు రంగు పూలహారాల కింద పొడవైన టేబిల్. దానిపై ఓడ ఆకారంలో కేక్. అక్కడ ఆఫీసువాళ్ళే కాక ఇంకా చాలామంది హాజరయ్యారు.

ఆకృతి అక్కడి ఏర్పాట్లని, వచ్చినవాళ్ళని చూసి బిత్తరపోయింది. ఏర్పాట్లు కిరణ్‌చంద్ర ఎంత ధనవంతుడో చాటి చెబుతుంటే వచ్చిన జనాలు అతడెంత నవనాగరీక ప్రపంచం వాడో తెలియజేస్తున్నారు.

అక్కడికి వచ్చిన వాళ్ళలో ఆకృతి మాత్రమే జడ, చీరలో వుంది. మిగిలిన వాళ్ళంతా రకరకాల హేర్ స్టయిల్స్‌లో వున్నారు. మిడీస్, చుడీదార్స్, సల్వార్స్, జీన్స్, బ్యాగీ డ్రస్సులతో వున్నారు. చాలా మంది బొట్టు పెట్టుకోలేదు. లిప్‌స్టిక్ లేని అధరం లేదు. గలగల పారే నయాగరాల్లా ఉత్సాహంగా, హుందాగా వున్నారు.

అలంకరణలో అందం ఆకృతికి వినూత్నంగా కన్పించింది. ఆకర్షించింది. తనలా డ్రెస్ చేసుకుంటే ఎలా వుంటుందో వూహించుకుంది. ఆమెకి నవ్వుగా– సిగ్గుగా అన్పించింది. ఎంతయినా సిటీలో పుట్టి పెరిగి చదువుకున్న అమ్మాయిలు ఆధునిక వస్త్రధారణలో ఎంతో చలాకీగా, అందంగా, హుందాగా, సహజంగా తోస్తారు. ఆ ఈజీనెస్ మధ్య వేసుకునేవారికి రావటానికి చాలాకాలం పడుతుంది. బట్టలు – అలంకారమే కాదు వాళ్ళు ఇంగ్లీషు మాట్లాడటంలో కూడా ఒక విధమైన సొగసు వుంటుంది. భాష సరళ ప్రవాహంగా సాగుతుంది.

క్రికెట్, వెస్టర్న్ మ్యూజిక్, టెన్నిస్, బ్రేక్ డ్యాన్స్– ఇవన్నీ వాళ్ళందరి సంభాషణల్లో దొర్లిపోతుంటే ఆకృతికి నోట్లో నుండి మాటలే రాలేదు. ఆమెకి ఏ మాత్రం పరిచయం లేని లోకాల గురించి ఆమె ఏం మాట్లాడలేక ఒంటరిగా ఒక మూల కూర్చుండిపోయింది.

తొలిసారిగా తనీ ప్రపంచంలో ఎంత వెనకబడి వుందో అర్థం అయింది.

***

ఆఫీసుకి వెళుతుంటే ఆకృతి పాదాలలో చిన్ని వుత్సాహం. చాలా రోజుల తర్వాత, పార్టీ నుండి రాగానే ఒక కవిత రాసింది. 'కిరణ్ చంద్రకి ఇస్తే' అనుకుంది కాసేపు. అతనికి తెలుగు చదవటం వచ్చో రాదో అని మరి కాసేపు మధనపడింది. చివరికి హర్షకి పంపించాలని నిర్ణయించుకుంది.

అటెండన్స్ రిజిస్టర్‌లో సంతకం పెట్టి డిపార్ట్‌మెంట్‌కి వెళ్ళింది. పదకొండైనా కిరణ్‌చంద్ర ఆఫీసుకి రాలేదు. పన్నెండవుతుంటే అతను సైట్‌కి వెళ్ళాడని తెలిసింది. ఆమెకి ఏదో వెలితిగా అన్పించింది.

మధ్యాహ్నం మూడు గంటలైంది. బాల సూర్యం, ప్రభాకర్ హడావిడిగా డిపార్ట్‌మెంట్‌లోకి వచ్చి పగలబడి నవ్వుతున్నారు. వాళ్ళిద్దరి వెనకాల పర్సేప్ అసిస్టెంట్ కారుణ్య వచ్చాడు. నవ్వు ముఖంతో వున్న అతడిని "ఏంటి విషయం" అడిగాడు వరదవర్మ.

"నే... నే.... ఆప...రే...టర్ని... ప్రేమిస్తున్నానంట" ఆపుకోలేని నవ్వుతో చెప్పాడు కారుణ్య.

"ఆపరేటర్నా" రఫ్ క్యాష్ బుక్ రాస్తున్న వరదవర్మ ఆశ్చర్యంగా అడిగాడు.

"గొప్ప గాళరా మ్యాస్ తెచ్చావ్ గాని కూర్చో కూర్చో... ఎవరితో అంది" అడిగాడు ప్రభాకర్.

"మా బాస్‌తో చెప్పిందంట. ఆయన నన్ను పిలిచి 'ఆమెతో నీకేంటి కారుణ్యా'

## వాడు–నీవు

వాడికి–
నీ పొంగే వయస్సు మీదున్న ప్రేమ
నీ మీద లేదు
నీకు అలంకరణ మీదున్న శ్రద్ధ
నీ మీద లేదు
వాడిచ్చిన విలువెత్తు అద్దం ముందు
కొన్ని తరాలసేపు నిల్చావు నీవు
వాడు నల్లమందు అద్ది తెచ్చిన మూరెడు మల్లెల తావిలో
యుగాలకైనా దిగని మత్తు పీల్చావు నీవు
నగలు, చీరలు, మల్లెలు వాడి ఆయుధాలని
నీకు తెలియనే తెలీదు
వాటిని ప్రయోగించినప్పుడల్లా
అమాయకంగా లొంగిపోతూనే ఉంటావు
వాడు–
నీ చుట్టూ కనిపించని కట్టుబాట్ల కంచెల్ని పాతి
నీ ముందు అందమైన మంచుకలల్ని పేర్చి
శతాబ్దాలు నిశ్శబ్దంగా గడిపేశాడు
వాడు–
మనువుని జీర్ణించుకొని బలిసినవాడు
పురాణాలు నరనరాల కెక్కించుకొన్నవాడు
వాడికి కండ వుంది
లోకం అండ వుంది
వాడి దృష్టిలో–
నువ్వొక కామకేంద్రానివి
తృష్ణబాపే కోర్కెల చలివేంద్రానివి
వంటపాత్రవి
నిశా శయ్యవి
వాడి దృష్టిలో కేవలం–
వంశాభివృద్ధికి మార్గానివి
నిషాలో అందే స్వర్గానివి
సజీవ శవానివి
మాట్లాడే మాంసానివి
అంతే
మరోలా ఆలోకించదు
మనిషిలా ఆలోచించదు
నీవు–
పాలుబట్టినా, రూపాలు బట్టినా
కృతజ్ఞత చూపడం వాడి రక్తంలోనే లేదు
వాడి పాదపద్మాల సేవే ధర్మంగా భావించేవరకు
నీ ముఖంలో వెన్నెల కాయదు
వాడితోడే జీవితమని భ్రమించేవరకు
నీ మెడల్లో పొద్దు పొడవదు!

–షకూర్

# పాతాళజలం

(నదినా గోర్డిమర్ నవల 'మై సన్స్ స్టోరీ'
సారాంశం గ్రోలి...)

దేశభక్తి అంటే ఇంత విస్పష్టార్థం
త్యాగం అంటే ఇంత రక్తసిక్త పుష్పం
పోరాటం అంటే ఇంతగా ఎదిగిన పురుషకారం–
మనిషికీ మందికీ నడుమ
అనుస్యూత తూర్యారవం!
ఇదీ నేడు భూగోళ మంతటా
ఒకే శ్రుతితో సాగే జీవన గానం...

ఎక్కడ ఆధునిక చేతన వికసించినా
పీడిత మానవుడే ఆ యితిహాసానికి కేతనం
అలనాటి నుంచి నేటివరకూ
మనిషే కంటక కిరీట ధారి...

చీకటి అడవి మనిషిగా
ఈసడించబడిన బానిస
నేటి ప్రపంచ ప్రజా చైతన్యానికి
కాగడా ఎత్తి ముందు నడుస్తున్న మకుటధారి...
ప్రపంచం నేడు అంపశయ్యపై పవళించి
ఆ పాతాళ జలం కోసమే నిరీక్షిస్తూ...

2
ఏక శిలా విగ్రహం వంటి ఆజానుబాహూ!
నువ్వు చేతులెత్తితే అందరాని
అంగార గ్రహం లేదు సుమీ!
నీ బాహువులు దృఢంగా సాచు–
అందుతుంది ఆప్యాయనంగా రోహిణి...
మృగశీర్షం నీ పాదాల ముందు ఒంగుతుంది




ఆశ్లేష – నీ కమ్మని మృణ్మయ కాయాన్ని ఆశ్లేషిస్తుంది
నీవు లేని ఈ లోకం
సగం వెలుగు – సగం నీడ
సర్పం పరిహార క్రీడ...
కనీనికలన్నీ నల్లనివే
దర్శనమే కాంతిమయ ధావళ్యం...
నీవు వినా ఈ గోళం
చిరనిద్రా స్తబ్ధవ్యాళం...

3
ఈ క్షణం ప్రత్యక్షం
మరో క్షణం పరోక్షం
సర్వాంతరంలో సర్వాంతర్యామి
నయనాయనంలో క్షుభిత శక్రచాపం
కరువు గంజి కూడా కతకలేని ఆకలి పులి
Vie tragique ... Vie trivial...
బ్రతికిన కాలమంతా మందా క్రాంతం
ఆకస్మిక భయోత్పాతంగా అఖాతాలెదురయ్యేదారి...
నిరాదరణల జాగరణలు
సాగర తరంగాల వ్యర్థ వార్ధక్యం!
ప్రతి రేయీ ఒక కత్తుల గోయి–
అర్థరహిత యథార్థాల గవేషణ...

4
ఇది సమయం కాదు సుమీ
లంగ రెత్తకండి కొత్త పడవలకు...
ఆశా శుభ్ర వసనాల తెరచాపలు కూర్చకండి!

కాళరాత్రి పాదాల నిండా మృత్యురేఖలు!
ఏదీ ఎక్కడ? మన కోసం నిరీక్షిస్తోంది–
భూపాలీ రాగ శంపాలత?!
*** *** ****

– సోమసుందర్

అంటూ లెక్చరివ్వబోయాడు. 'ఏమిటి సార్, ఎవరు' అని నేనాశ్చర్యపోతే, 'ఆపరేటర్ వచ్చి నువ్వు తనని ప్రేమిస్తున్నావని చెప్పింది' అన్నారు" అన్నాడు కారుణ్య.

కారుణ్య ఫ్రెష్ ఫ్రమ్ కాలేజ్. ముప్పై ఆరేళ్ళ ఆపరేటర్‌కి ఈ ఇరవై ఏళ్ళ కుర్రాడు ఎలా తోచాడో!

"నువ్వేమన్నావ్" అడిగాడు వరదవర్మ.

"గట్టిగా వాయించాను. 'సార్, ఆవిడ వయస్సేంటి, నా వయస్సేంటి? పోనీ వయసు గొడవ వదిలెయ్యండి. ఆవిడేమైనా సౌందర్య రాసా? పోనీ సాధారణమైన అందమేనా వుందా? ఆ స్వరంలో సౌమ్యత వుందా? అర్థరాత్రి గూడ్సు బండి వెడుతున్న రొద లాటి ఆ గొంతు విని పట్టపగలు ఆఫీసులో ఎగిరెగిరి పడుతున్నాం! పోనీ చాలాడబ్బుందా అంటే అదీ లేదు. తెగిన చెప్పు కుట్టించడానికి డబ్బులు ఖర్చు పెట్టడానికి కూడా ఏడ్చే పిసినారి. ఏం చూసి ప్రేమించాలా మహాతల్లిని. వయస్సా? అందమా? డబ్బా? మనసా? మంచితనమా? బుద్ధున్న వాళ్ళెవరైనా అసలామెని పలకరిస్తారా? ఆమె ఏదో అందనుకోండి. మీరెలా నమ్మారు' అని అడిగాను" అన్నాడు కారుణ్య.

అందరూ నవ్వుతూ వింటున్నారు.

ఇంతలో "క్యాషియర్‌గారు" అంటూ ఆపరేటర్ వచ్చింది.

అందరూ నవ్వులు ఆపేశారు.

"ఏం మేడమ్" మర్యాదగా అడిగాడు వరదవర్మ.

"సార్ వున్నారా?"

"ఆ వున్నారు" అన్నాడు ప్రభాకర్.

ఆమె జి.ఎం.ఎఫ్. రూము వేపు అడుగులేస్తూ "సోమయ్య ఏడండి. అస్తమాను ఇలా బోర్డ్ వదిలి రాలేకపోతున్నాను" అందామె.

"ఇంటర్‌కమ్ వుందిగా" అన్నాడు గోవింద.

"ఉంది. గొప్పగా పని చేస్తున్నాయని! వీళ్ళెంతో అందగాళ్ళని చూడడానికి గదుల్లోకి పోతున్నాననుకున్నారా? నాకు పెళ్ళయి పన్నెండేళ్ళు అయింది" గట్టిగా అందామె.

అంతా అదిరిపోయి చూస్తున్నారు. ఆమె జి.ఎం. రూమ్‌లోకి వెళ్ళింది.

ఐదు నిమిషాల తర్వాత బయటికి వస్తూ "కారుణ్య గారు, మీరు నన్నపార్థం చేసుకున్నారు" అంటూ కారుణ్య చేతులు పట్టుకొని వెక్కెక్కి ఏడవటం మొదలుపెట్టింది.

"ఇదేంటి మేడమ్" కంగారుగా అన్నాడు కారుణ్య.

చప్పున అతని కాళ్ళపై పడి గట్టిగా ఏడవడం మొదలుపెట్టింది.

'ఈ ఆఫీసులో పిచ్చివాళ్ళు మాత్రమే సుఖంగా పనిచేయగలరు' అనుకుంది ఆకృతి.

***

ఆదివారం

ఉదయం పదిన్నర. తలస్నానం చేసి తడిజుట్టు గాలికి వదిలేసి చీరలు ప్రెస్ చేస్తోంది ఆకృతి.

తలుపు చప్పుడైతే తీసింది. ఎదురుగా వాచ్‌మేన్. అతని వెనుక మరో వ్యక్తి నిలబడి వున్నారు.

"మీ కోసం వచ్చారు" అన్నాడు వాచ్‌మేన్.

ఆ వ్యక్తి ఒక కవరు అందించాడు. కవరులో మడతపెట్టిన కాగితం విప్పింది.

డియర్ అక్కా,

మేం విన్న వచ్చాం. హోటల్లో వున్నాం. వెంటనే బయలుదేరి రా. ఇతను టాక్సీ డ్రైవర్. ఆ కారులోనే రా

4 అరుణ

ఎవరెవరొచ్చారు. హోటల్లో దిగటమేంటి? ఐరన్ బాక్స్ ప్లగ్ తీసి స్విచ్ ఆఫ్ చేసింది. జడ అల్లుకొని వస్తానంటే ఏం అనుకుంటారో, ఆలస్యం అవుతుం దేమో. జుట్టుని పైపైన దువ్వి క్లిప్ పెట్టి తాళం వేసి కారు ఎక్కింది.

కారు ఓ త్రీస్టార్ హోటల్ ముందు ఆగింది. ఆకృతి దిగింది. డ్రైవర్ వెంట లిఫ్టులో గది దగ్గరికి నడిచింది.

విమల తలుపు తీసింది. డ్రైవర్ వెళ్ళిపోయాడు "ఎలా వున్నావ్" అడిగింది విమల.

"ఇదేంటే ఈ జుట్టు, చీర. కాస్త మంచి చీర కట్టుకోకపోయావా" అంది అరుణ.

"ఆలస్యం అవుతుందని— డ్రైవర్ వెయిట్ చెయ్యాలని, ఎలా వున్న చీరతో అలావే వచ్చాను" అంది ఆకృతి.

విమల కాఫీ ఆర్డర్ చేసింది. బాత్రూంలో నుండి ఆనందరావు వచ్చాడు.

"ఎలా వుంది వుద్యోగం" అడిగాడతను.

"బానే వుంది"

"ముందా జడ విషయం చూడు" అంది అరుణ.

"ఇక్కడెందుకు దిగారు" అడిగింది ఆకృతి గదిని కలియచూస్తూ.

"అరుణ ఇప్పుడు హీరోయిన్‌గా. ప్రొడ్యూసర్‌దే ఖర్చంతా. సాంగ్ పిక్చరైజేషన్ కోసం వచ్చారు" అంది విమల.

"అక్కా! మేం ఒంటి గంటకి లొకేషన్‌కి వెళుతున్నాం. నువ్వూ రా" అంది అరుణ.

అరుణ ఎలా నటిస్తుందో చూడాలని ఆకృతికి కుతూహలంగా వుంది.

రాత్రి పది గంటలయింది ఆకృతి ఇంటికి వచ్చేప్పటికి. మంచంపై వాలిన ఆకృతికి అరుణ హీరోతో కలిసి చేసిన డాన్స్, ఆమె వేసుకున్న డ్రెస్ గుర్తొ స్తూనే వున్నాయ్. ఓణి వేసుకునే రోజుల్లో పొరపాటున పయిట కాస్త కదిలినా కేకలు వేసే తల్లి అరుణ అంగాంగ ప్రదర్శన చేస్తూ బట్టలు వేసుకోడాన్ని ఎలా ఒప్పుకుందా అని కాసేపు ఆశ్చర్యపోయింది.

అరుణ, విమల ఆకృతి గది చూడాలని ఎటువంటి ఆసక్తి చూపించలేదు. ఆకృతి ఆ విషయానికి ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వలేదు.

***


లంచ్ అవర్లో ఆకృతి తప్ప సీట్లలో సాధారణంగా ఎవ్వరూ వుండరు. ఇంట ర్‌కమ్ మోగుతుంటే ఆకృతి నంబర్ వేపు చూసింది. 18. అంటే మార్కెటింగ్ స్టాఫ్ హాల్ నంబర్. తటపటాయిస్తూనే ఫోన్ తీసింది.

"హలో"

"ఐయామ్ కిరణ్‌చంద్ర. బాగున్నారా" అడిగాడతను.

ఆ నంబర్‌లో కిరణ్‌చంద్రని వూహించలేదేమో— ఆమెలో చిన్న సంచలనం.

## వ్యాల్యుయేషన్




ఇక్కడ అన్నీ ఖరీదే
కప్పలూ – కుందేళ్ళూ
చేపలూ పీతలూ
అన్నీ ఖరీదే
పంచదార – కిర్సనాయిలూ
బియ్యమూ – కందిపప్పూ
కంకర – కట్టె పుల్లలూ
చివరకు నీళ్ళు – పాలూ
కూడా ఖరీదే
ఒక్క ప్రాణం తప్ప
మనిషి ప్రాణం తప్ప
నడుస్తూ – నడుస్తూ
ఏడుస్తూ – ఏడుస్తూ
నవ్వుతూ – నవ్వుతూ
శ్రమిస్తూ – శ్రమిస్తూ
ఎక్కడైనా ఎప్పుడైనా
గుక్కెడు ప్రాణం గుటుక్కుమనొచ్చు.
ఖరీదు కట్టే షరాబు లేదు.
ఈ విషయం శ్రీశ్రీకి తెలీదు.
మార్క్సుకీ తెలీదు.
వెనక చక్రం కింద పడ్డా
ముందు చక్రం కింద పడ్డా
పడినవాడి స్థాయికొద్దీ ప్రాణం ఖరీదు.
మరీ సామూహికమైతే గుంపులో గోవిందా

ఎన్ని ప్రాణాలని లెక్క గడతాము
ఎన్ని శవాలని లెక్క పెడతాం
అయిన కాడికి ఓ పది అటో ఇటో
పాకీ దొడ్డి టాంకు
శుభ్రం కోసం
గుంటలో దిగిన మనిషి
గుంటలోనే గంట కొట్టేస్తే
మలంలో మకిలి పురుగులా
మరణం ఒక వార్త కాదు.
ఖరీదైన బ్రీఫ్‌కేసూ
సాంద్రీకృత నల్లడబ్బు
వేసుకున్న సఫారీ సూటు
సరుకు ఖరీదు ఎక్కువ చేస్తాయి.
విమానమైతే మరీ మేలు
కోట్లు పలకొచ్చు ప్రాణం

నత్తగుల్లకీ కోడి పిల్లకీ తేడా లేదు.
సామూహిక చావు
పెళ్ళితో సమానం
అందుకే
భోపాల్లోనూ
బొగ్గు గనుల్లోనూ
వనాల్లోనూ రణంలోనూ
ప్రాణానికి ఖరీదు లేదు.
సర్టిఫికెట్లున్నాయి
త్యాగమనో భోగమనో
లేకుంటే
నగటున
పది పైసలతో ఇటు
ఓ గుట్ట వేలం పాట
మరో గుట్టకు మళ్ళీ వాయిదా
అవతల
చుట్టూ నోట్లు పేర్చుకుని
బంగారపు పాడెమీద
అచ్చోసిన ఆబోతెద్దులా
ఓ ప్రాణం
అమూల్యంగా పడి ఉంది
వెల కట్టేందుకు
మేధావులు తలలు పగలగొట్టుకుంటున్నారు.
రాబోట్లు – కంప్యూటర్లు
వస్తున్నాయి – ఫారెన్నించి
షేరు మార్కెటులా
శవం ఖరీదు అటూ ఇటూగా ఉంది

– వాణీ రంగారావు



## నిద్రలేమి

ప్రతిరాత్రీ
కరుణించని నిద్రాదేవి కాళ్ళముందు
మోకరిల్లి వేడుకుంటూ వుంటాను.
తన ఒడిలోకి తేలిగ్గా చేరుకుందామని
రోజంతా ఒళ్ళు హూనం చేసుకున్నా
ఫలితం శూన్యం
ఇవేళ్టి రోజున కూడగట్టుకున్న నిస్తేజం
హేళన చేస్తుంటే,
రేపటి జీవితపు యాంత్రికత
ముందుగానే ఎదుట నిలబడి
వేస్తున్న వికటాట్ట హాసం.
మధ్య తరగతి కోరికల చట్రాల మధ్య
ఆశయాలు నలగుతూన్న చప్పుడు
"ఇజాల" బరువుల క్రింద కుంగిపోతూ
నిజం చేస్తున్న ఆర్తనాదం
రంగురంగుల పత్రికల్లోంచి
సాహిత్యం డీ కంపోజ్ అవుతున్న దుర్గంధం
చిరునవ్వులపై మనుషులు వేస్తున్న
రోలింగ్ షట్టర్ల శబ్దం
మెటీరియలిజం పంజరంలో చిక్కుకుని
పోరాడుతూ అలిసిన అస్తిత్వపు
నిస్సహాయ నిట్టూర్పులు
ఇవన్నీ మూసిన నాకనురెప్పల
క్రింది ఇసుక రేణువులు
ఈ శబ్దాలే, ఈఘోషలే
నా నిశీయాన సహచరులు
తెల్లవారగానే మండుతున్న కళ్లతో
ప్రపంచారణ్యంలోకి బయలుదేరుతాను
మానవత్వమనే తులసి మొక్కల
జాడల్ని వెతుక్కుంటూ!
చావని ఆశ!!

— ఫహీమ్

సైట్ నుండి ఎప్పుడొచ్చారో అనుకుంటూ "ఫైన్" అందామె.

"క్యాషియర్ వున్నారా"

"బ్యాంక్‌కి వెళ్ళారు"

"వస్తే టూర్ అడ్వాన్స్ కావాలని చెప్పండి. ఓచర్ పంపిస్తున్నాను."

"సరే"

'అతను ఓ పెద్ద మేనేజర్. తనేమో చిన్న ఉద్యోగి. అతనితో ఇలాగేనా మాట్లాడేది. ఒక్కసారి కూడా 'సార్' అనడంలేదు. అతనేం అనుకుంటాడో! పొగరు? అవునా! అతనేం అనుకుంటే నీకేం ఆకృతి?'

"పార్టీ అయ్యేవరకు వుండకుండా వెళ్ళిపోయారేం" మృదువుగా అడిగాడు.

ఆమెకి ఏం జవాబు చెప్పాలో తెలియలేదు.

"మీకు తిరిగి వేరుగా పార్టీ ఇవ్వాలనుకుంటున్నాను. మీకెప్పుడు వీలవుతుందో చెప్పండి" అన్నాడతను.

ఆమెకి ఇదంతా కలగా వుంది. అతని పుట్టినరోజు అయి పదిరోజులయింది. ఇన్ని రోజుల తర్వాత అతడిలా ఆఫీసులో అడుగుతుంటే ఆమెకి ఏం చెప్పాలో తెలియలేదు. కానీ అతను తనని పట్టించుకున్నాడనే విషయం ఆమెకి చాలా సంతోషాన్నిచ్చింది.

"ఆలోచించి చెప్పండి" అన్నాడతను.

ఆమె రిసీవర్ క్రెడిల్ చేసింది.

* * *

'కిరణ్‌చంద్రతో పార్టీకి వెళ్ళాలా వద్దా? అసలు అతనెందుకు తనపై ఆసక్తి చూపిస్తున్నారో? పార్టీ అంటే ఎక్కడిస్తారో? పిలిచాక వెళ్ళకపోతే బాగుండదు. సరే మళ్ళీ అతను అడిగినప్పుడు కదా... చూద్దాం!'

లంచ్‌అవర్‌లో బాల్కనీలో నిలబడి ఎర్రని పూలని పచ్చని ముక్కుతో చిక్ చిక్‌మని కొరుకుతున్న చిన్ని చిన్ని పిట్టలని ఆకృతి చూస్తోంది.

"తనొక్కర్తే అందమైందని ప్రత్యేకంగా ఆకృతినొక్కర్తినే బర్త్‌డే పార్టీకి కిరణ్ చంద్రగారు పిలిచారు. ఏం మనమంతా మనుషులం కాదా" సీతాచార్యులు అంటూంది.

"ఆకృతి చాలా అందమైనదనీ! పిలిచారు!! అయితే ఏంటంట? మీకెందుకింత బాధ? ఎవరికి నచ్చినవాళ్ళని వాళ్ళు పిల్చుకునే హక్కు వుందికదా!" నవ్వుతూనే జవాబిస్తోంది రాగమణి.

సీతాచార్యులది చైల్డ్ సైకాలజీ. ఆమె ఎటువంటిదైనా అందరూ ఆమెని భరించేది ఫోన్‌కోసం. ఆమెతో కాస్త ఎక్కువ మంచిగా వుంటే వాళ్ళకి వచ్చిన పర్సనల్ కాల్స్‌ని కళ్ళకి అద్దుకొని ఇస్తుంది. లేకపోతే అరచిగీపెట్టినా ఎంత అర్జెంట్‌కాల్ అయినా, అవతల ఎవరికైనా సీరియస్‌గా వుందని మొత్తుకున్నా ఇవ్వదు. కిరణ్‌చంద్ర కాదు ఆఫీసులో చాలామంది ఆకృతి అందం వేపు ఆకర్షితులవ్వటం నిజం. అది ఈమెకి భరించరాని వేదనగా వుంది.

ఆకృతికి సంభాషణంతా వినిపించింది. మొదటిసారిగా 'ఉద్యోగం మానేస్తే' అనే ఆలోచన వచ్చింది.

"నీకోసం ఎవరో వచ్చారు" అంది వెనక నుంచి రాగమణి. చప్పున తలతిప్పింది.

"ఎక్కడున్నారు?"

"విజిటర్స్ లాంజ్‌లో కూర్చోపెట్టి నీకు చెపుదామని వచ్చాను" అంది రాగమణి.

ఆకృతి విజిటర్స్‌లాంజ్ దగ్గరికి వెళ్ళింది.

మెరుపుమెరిసినట్టు–చినుకురాలినట్టు–పువ్వు పూసినట్టు హర్ష దర్శనమిచ్చాడు.

"మీరిప్పుడు ఖాళీగానే వున్నారా? వచ్చి ఇబ్బంది పెట్టానా" అడిగాడతను.

"ఒక్క క్షణం" అంటూ వెళ్ళి ఐదు నిమిషాలలో పర్స్‌తో తిరిగొచ్చింది.

"రండి" అంటూ బయటికి నడిచింది.

ఆఫీసు బయటకి వచ్చాక "లీవ్ పెట్టాను. బోల్డన్ని కబుర్లు చెప్పుకోవచ్చు" అందామె.

"ఎక్కడికి వెళదాం" నవ్వుతూ అడిగాడతను.

"ముందు ఇంటికెళ్ళి కాఫీ తాగుదాం" అందామె.

గదిలోకి వచ్చాక "భోజనం అయిందా" అనడిగింది.

## ప్రైవేట్లు "ప్రైవేట్లు"



తెల్లారగట్ల చలిచెవుల్ని పుస్తకాల్లో దాచుకుని
పనిగట్టుకుని లోకాన్నుద్ధరించాలని వెళ్ళే వాళ్ళం
మేష్టారికైనా టీ నీళ్ళు దక్కేవేమో, మాకదీలేదు
నిద్రమంచాల్ని దాటుకుని
ఒకరింటి వాకిలి దగ్గర మరొకరు అల్లారాలై
లెక్కలింగ్లీష్సైన్సుల్ని పసిపాపల్ని చేసుకెళ్ళే వాళ్ళం
దొంగ చన్నీళ్ళ స్నానంతో తీరని సగం కునికిపాటూ
మిత్రబృందం కళ్ళబడుతూనే చప్పనెగిరిపోయేది
పుస్తకాల్లోది తప్ప అన్నీ మాట్లాడుకునే వాళ్ళం
అప్పడే కాని ఇంజనీర్లమీ, కాని డాక్టర్లమీ మేమే అవుతామని
మాకేం తెల్సు?!

పదోక్లాసు వెలగబెట్టున్దుకు
బెత్తానికి జడిసేదిలేదని దార్లోనే తీర్మానించుకునే వాళ్ళం
ప్రైవేటు మహాయజ్ఞంలో నచ్చేదొక్కటే-
నిదుపాటి రెండు మైళ్ళ నడక
కొట్టుకుంటూ, తిట్టుకుంటూ
నవ్వుకుంటూ, తుళ్ళుకుంటూ
మిడతల దండులా వాలేవాళ్ళం చివరికి పుస్తకాల మీద
మేష్టారి పిల్లల్నెత్తుకు ఆడించే ఆయాలమై కాసేపు
రకరకాల మొక్కల్ని పెంచే తోటమాలులమై కొంచెం సేపు
పరకాయ ప్రవేశం చెయ్యడమూ విద్యలోని భాగమే
కంఠాన్నించి తలకాయని వేరుచేసి
ఏదో గడగడా కంఠతా పట్టేసే వాళ్ళం
మాకేం తెల్సా?!
కాని ఇండస్ట్రియలిస్టులూ, కాని ఐ.ఏ.ఎస్‌లూ మేమే అవుతామని-
ఎరుపెక్కిన అరచేతుల దుఃఖాన్ని పుస్తకాల సంచీకి పూసుకుంటూ
ఆసక్తి లేని చదువుని 'హమ్మయ్య' అయ్యిందనిపించి
సెలవు దినాల్లోనూ తప్పించుకొందుకు వీలుపడక
స్వరాజ్యం తెచ్చినంతా కష్టపడి పోయే వాళ్ళం
సూర్యుణ్ణెక్కడైనా గుచ్చుకోనిచ్చేవాళ్ళమా!?!
వలనెత్తుకెగిరిపోయిన పావురాల్లా బయటపడే వాళ్ళం
బంధింపబడిన కాళ్ళని పరీక్షహాల్లో వదిలేసి
కొత్తకాళ్ళేసుకుని చక్కా వచ్చేసే వాళ్ళం
మాకేం తెల్సా!?!
ఇప్పడు బొటాబొటీ పబ్లిక్ రిలేషన్సూ, పాలిటిక్సూ డిగ్రీలమూ
ఎంతకీ గట్టెక్కని ఇంటర్ మీడియేట్‌లమూ
ఆగని ప్రపంచాన ఆగిపోయిన టెన్త్‌లమీ మేమే అవుతామనీ!!

— కె.గీత

"లేదింకా"

"ఎన్నాళ్ళకి చేతివంట రుచి చూపించే భాగ్యం దొరికింది" అంటూ కుక్కర్ స్టవ్‌పై పెట్టింది.

ఆమె వంట ప్రయత్నాన్ని అతడేం అభ్యంతరపెట్టలేదు.

"ఉల్లిపాయలు తరిగిపెడతారా"

"ఉల్లిపాయలా" భయంగా అన్నాడు హర్ష.

"ఏం మీక్కూడా కళ్ళనీళ్ళొస్తాయా" దిగులుగా అడిగిందామె.

"నాకు వస్తాయి" అంటూ తలని పక్కకి తిప్పి బరబరా రెండు ఉల్లిపాయలు తరిగింది.

అతనికి అన్నం వడ్డించింది.

"వేడి వేడి అన్నంలో గోంగూర, ఉల్లిపాయ ముక్కలు, నెయ్యి పోసుకొని కలుపుకొని తింటే గొప్ప మజాగా వుంటుంది" అంటూ నెయ్యి వేసింది.

అతను తింటుంటే "నోరూరుతోంది నాకో ముద్ద పెట్టొచ్చుగా" అంది.

అతను ఆమె వేపు చూశాడు. చాలా కొత్తగా, వింతగా వుందీ ఆకృతి. ఇదివరకెన్నడూ చూడని చనువు. ముద్దొచ్చే చనువు. ఏమైవుంటుందబ్బా?

ఆకృతి స్వభావరీత్యా శాంతగోదారి. దెబ్బలాటలు, పరస్పర ద్వేషాలు ఆమె భరించలేదు. ఆఫీసులో వాతావరణం ఆమెకి మొదటి నుండీ నచ్చలేదు, "ఇది" అని నిర్వచించలేని అయిష్టత. అటువంటి అయిష్టంలో రాగమణి చిరునవ్వు, కిరణ్‌చంద్ర అస్పష్ట అభిమానం ఆమెకి ప్రత్యేకమైన ఆకర్షణ. సీతాచార్యుల మాటలకి ఆమె కదిలిపోయింది. బాధతో వడలిన ఆమె మనసుకి హర్ష అనుకోని రాక చాలా రిలీఫ్‌నిచ్చింది.

తేలికైన మనసుతో హర్ష దగ్గర ఏవిధమైన అరమరికలూ లేని చనువుతో మాట్లాడేస్తోంది.

"ముద్ద పెడితే నాకేం ఇస్తారు" అడిగాడు హర్ష.

"ఏం కావాలి" తనూ అలాగే నవ్వింది.

"నా ఉత్తరాలకి జవాబు"

"ఎదురుగా నన్ను పెట్టుకొని మాట్లాడకుండా వుత్తరాలకి జవాబు అడుగుతారేం" నవ్వుతూ అందామె.

అతనో ముద్ద ఆమె అరచేతిలో వుంచాడు.

ఆకృతి రాజమండ్రి కబుర్లు అడుగుతూ మాట్లాడుతుండగా అతను భోజనం ముగించాడు.




"మీకేం కావాలి" అడిగాడతను.

"అంటే" అయోమయంగా అడిగిందామె.

"ప్రతివాళ్ళకీ ఏవో కొన్ని కోరికలు, ఆశలు, ఆశయాలు వుంటాయి కదా. అలా మీకేం లేవా" అడిగాడతను.

"మీకున్నాయా

మీ కోరికలేంటి?"

"చక్కని తోడు, కమ్మని కవిత్వం కావాలనిపిస్తుంది. ఇబ్బందిపడకుండా బ్రతకడానికి కావల్సినంత సంపాదన వుంటే బాగుండుననిపిస్తుంది" చెప్పాడతను.

"సంపాదన అవసరం అంటారా"

"కాదా"

"ఎందుకు"

"అందంగా బ్రతకడానికి" అన్నాడతను.

ఆమెకి చప్పున కిరణ్‌చంద్ర గుర్తొచ్చాడు. అతని బట్టలు, కారు కళ్ళముందు మెదిలాయి. ఆమె పరిశీలనగా హర్ష వేపు చూసింది.

'కిరణ్‌చంద్ర, హర్ష ఇద్దరూ సౌందర్యవంతులే. ఎవరి అందం వారిదే. కాని హర్ష కంటే చూసీ చూడగానే కిరణ్‌చంద్ర ఎవరినైనా ఇట్టే ఆకర్షించడానికి కారణం – కట్టుకునే బట్టలు, వేసుకునే విధానం, తిరిగే కారు. డబ్బు మనిషికి అందాన్ని ఇస్తుందన్నమాట. అన్నమాటేంటి వున్నమాటే!'

ఆమె ఆలోచనల్లోకి జారుకోవటం హర్ష గమనించాడు. ఆమె తన వునికిని పూర్తిగా విస్మరించిందని గుర్తించి "మీకేం కావాలో చెప్పలేదు" అన్నాడతను.

"ఏమో" అయోమయంగా అందామె.

'డబ్బు జీవితానికి కావల్సిన అందాన్ని, సుఖాలనీ ఇస్తుంది. సరే ఒప్పుకో వచ్చు. కాని డబ్బు సంపాదించడానికి స్ట్రగుల్ అవ్వాలి కదా! ఆ స్ట్రగుల్ మొదలైతే ఎక్కడా తృప్తి, శాంతి వుండదు. కావల్సినంత డబ్బు సంపాదించి ఆ డబ్బుతో అన్నీ అమర్చుకుని, ఇక సంపాదన గొడవే లేకుండా జీవితం గడపటం సాధ్యమా? అప్పటికి మనిషికి ఎంత వయసు చేజారిపోతుంది...'

హర్ష కాసేపు ఆమె ముఖంలోకే పరిశీలనగా చూసాడు. ఒక నిర్ణయానికి వచ్చినట్టు "మా ఇంట్లో పెళ్ళికి గొడవపెడుతున్నారు" అన్నాడు.

"ఎందుకు?"

"జీవితంలో స్థిరపడడానికి పెళ్ళి అతిముఖ్యమైంది కదా"

"పెళ్ళి అంత ముఖ్యమా"

"అదేంటి ఆకృతీ! పెళ్ళి చేసుకోవాలని మీకనిపించదా?" ఆశ్చర్యంగా అడిగాడు హర్ష.

"పెళ్ళెందుకు?" సీరియస్‌గా అడిగిందామె.

"తోడుకోసం"

"తోడెందుకు?"

"ఒంటరితనం ఫీలవకుండా"

"అసలు మనిషికి ఒంటరితనం ఎందుకొస్తుందంటారు?" మెల్లగా ప్రశ్నించిందామె.

"ఏమో" తెల్ల మొహం వేసాడతను.

"ఆలోచనలు ఆగిపోతే ఒంటరితనంగా అన్పిస్తుందేమో" అందామె.

"మీకెప్పుడూ ఒంటరితనం అనుభవంలోకి రాలేదా?"

"చెప్పానుగా. ఏ ఆలోచనా రానప్పుడు ఒంటరితనం ఫీలయ్యానని!"

"అంటే?" అర్థం కానట్టు అడిగాడు.

"మీ గురించో, రాగమణి గురించో, కవిత్వం గురించో,దేశం గురించో ఆలోచిస్తుంటాననుకోండి. అప్పుడేం ఒంటరితనం అనిపించదు. అలా ఎవ్వరూ ఆలోచనల్లో లేనప్పుడు అనిపిస్తుంది" అందామె.

"మీకు పెళ్ళి చేసుకోవాలని లేదా" అడిగాడతను.

"మీకు తెలుసు కదా పెళ్ళి చూపుల తతంగమే నాకు నచ్చదని!" అందామె.

"పెళ్ళి చూపులు, అరేంజ్డ్ మేరేజ్ గురించి వదిలెయ్యండి. మీ పరిధిలోకి వచ్చిన అబ్బాయిలెవ్వరూ మీకు నచ్చలేదా?" అడిగాడతను.

"పరిచయం అయిన వాళ్ళందర్నీ పెళ్ళికి పనికొస్తారాని చూస్తామటండీ"న వ్వుతూ చురుకుగా అంది. ఆకతి అంత మాత్రం చలాకీగా నవ్వడం అరుదే.

"చూడం. కాని 'ఇటువంటి తోడు దొరికితే బాగుండును' అనిపించే వ్యక్తే మీకు తారసపడలేదా?" ఆమె కళ్ళలోకి చూస్తూ అడిగాడు.

"లేదండి. అసలింత వరకూ మిమ్మల్ని తప్ప స్నేహితులుగా నేనే అబ్బాయినీ ఒప్పుకోలేకపోయాను" నిజాయితీగా అందామె.

మరుక్షణం ఆమె అంతరంగంలో కిరణ్ చంద్ర! 'అతడేమవుతాడు ఆకృతీ నీకు? ఏం కాదు! ఏం కాకపోతే అంత మంది అబ్బాయిలున్న ఆఫీసులో అతడొక్కడే ఎందుకు గుర్తొస్తున్నాడు?'

ఆమె మాటలకి హర్ష హృదయంలో ఆనందపు తరంగాలు తుళ్ళిపడ్డాయి.

"నేనడుగుతుంది పెళ్ళి గురించి" తెలివిగా అన్నాడతను.

"చెప్పానుగా పెళ్ళి గురిచి ఆలోచించలేదని" అందామె.

"జీవితానికి పెళ్ళి అంత ముఖ్యమా" అడిగిందామె.

"ముఖ్యమే" స్పష్టంగా చెప్పాడతను.

"ఎందుకని"

అతడామె ప్రశ్నకి జవాబు చెప్పకుండా "ఇంకో ముద్ద పెట్టనా" అనడిగాడు.

ఆమె చిర్నవ్వుతో "ఆ" అంది.

భోజనం పూర్తయ్యాక ఇద్దరూ మాట్లాడుకున్నారు. ఎక్కువగా ఇటీవల తాము చదివిన కవిత్వం గురించే!

"టీ తాగుదామా?" అడిగిందామె.

"నే చేస్తాను" అన్నాడతను.

అతను టీ కలిపి కప్పుల్లో పోసి ఒకటి ఆమెకి అందించాడు. ఆమె ఒక గుక్క తాగి "చాలా బాగుంది. మీరు వంట బాగా చేస్తారా" అనడిగింది.

"ఓసారి మా వూరొస్తే నా వంట రుచి చూడొచ్చు. గోదారిని చూడొచ్చు" అన్నాడతను.

"ఆ రుచేదో ఇక్కడే చూపించొచ్చుగా. ఇక గోదారంటారా – ఎలాగూ వన్ను గోదారితో పోల్చారుగా" అందామె.

"సరే రాత్రికి నే వంట చేస్తాను" చెప్పాడతను.

"మీరు చాలా మంచి వారండి" అంటూ వుత్సాహంగా సాయంత్రం వరకు కబుర్లు చెప్పింది. ఆరున్నరవుతుండగా ఇద్దరూ చల్లగాలికి అలా అలా తిరిగి

రావడానికి వెళ్ళారు. దార్లో జాజిపువ్వులు కన్పించాయి.

అతడు ఆమెనల్లని జడ వేపు చూస్తూ "జాజిపువ్వులు బాగుంటాయి కదండి" అన్నాడు.

"కొనుక్కుందామా" అందామె.

"నేనేం చేసుకోను"

"నాకా పూలంటే ఇష్టమైనా పెట్టుకోడానికి జడలేదు కాబట్టి జడవున్న నే పెట్టుకుంటా. మీరు మాత్రం పూలకి డబ్బులు ఇవ్వాలి సుమా"అందామె.

రాత్రి అతను వంట చేస్తూంటే ఆమె తిలక్ "అమృతం కురిసనరాత్రి"లో కవితలు చదివి వినిపించింది. ఇద్దరూ భోజనం చేశారు.

"మీ వంట బాగుంది. చిన్నప్పుడే మీ అమ్మగారు నేర్పించారా?"

"చిన్నప్పట్నుండి అబ్బాయిలకి ఇంటి పనులన్నీ నేర్పించిన మీ అమ్మగార్ని అభినందించాలి" మెచ్చుకోలుగా అందామె.

అతను నవ్వాడు.

రాత్రి పదకొండవుతుంటే–

"నిద్రస్తూందా" అడిగిందామె.

అతను జవాబు చెప్పలేదు.

"మీరిలా మంచాన్ని ఆక్రమించండి" అందామె.

"వద్దొద్దు. మీరే మంచంపై పడుకోండి" అన్నాడతను.

ఏదో గుర్తొచ్చినట్టు నవ్విందామె. ఏమిటన్నట్టు చూశాడు.

"ఒకే గదిలో వుంటున్నవాళ్ళ ఇంటికి రెండో వ్యక్తి వచ్చినప్పుడు మంచంపై మీరు పడుకోండంటే మీరుపడుకోండనే వాదన చాలా నవల్లో, కథల్లో చదివాం కదా. ఇప్పడా పరిస్థితి మనకొచ్చింది. అంటే ఈ లెక్కన సాహిత్యంలో వాస్తవం వున్నట్టేగా"అందామె.

"ఇలాగ కూడ వేదికలెక్కి మాట్లాడొచ్చండోయ్" అంటూ అతను నవ్వాడు.

ఆమెమంచం ఎత్తి గోడవారగ నిలబెట్టి గది తుడిచి ఇద్దరికీ పక్కలు పరిచింది.

హర్షకి ఆమెని చూస్తుంటే గొప్ప ఆశ్చర్యం – ఆనందమూను. ఒంటరితనం – ఏకాంతం ఆమెని భయపెట్టక పోవటం చూపుల్లో నిస్సంకోచం – నిర్భీతి. అసలెక్కడైనా ఇటువంటి అమ్మాయిలుంటారా?"

"నికో దిండు నాకో దిండు" అంటు పక్కమీద వాలుతూ "లైట్ ఆఫ్ చెయ్యటం ని డ్యూటీ. కావలిస్తే బెడ్‌లైట్ వేసుకోండి" అందామె.

"నికల్పపరం లేదా"

"లేదు"

అతను బెడ్‌లైట్ వేసి పక్క మీదకూర్చుని ఆమె వేపు చూశాడు.

అంత చేరువలో స్త్రీత్వం ముగ్ధంగా స్నిగ్ధంగా పవళించటం అతనికి ఇదేతొలి సారి. జాజుల పరిమళం హాయిగా మత్తుగా వుంది.

"ఈ రోజెలా గడిచింది" అడిగాడు హర్ష.

"చాలా బాగుంది" అంది ఆకృతి.

"రోజూ బాగుండదా"

"బానేవుంటుంది. కాని ఈరోజు చాలా బాగుంది"అందామె.

"ఏంటి తేడా"

"రోజూ ఒక్కర్తినే చేసే పనులు ఈరోజు మీతో కలిపి చేయటం వలవ బాగుందనుకుంటాను" అందామె.

"పెళ్ళి అందుకోసమే" చప్పన చెప్పాడతను.

ఆకృతి విస్మయంగా అతని వేపు చూసింది. మధ్యాహ్నం సంభాషణలో వచ్చిన ప్రశ్నకి ఈ వేళప్పుడు అతను జవాబు ఇవ్వటం ఆమె వూహించని విషయం.

"ఆకృతీ! ఇన్నాళ్ళూ మీరీ విషయం ఆలోచించకపోవచ్చు. ఇప్పుడైనా ఆలోచించండి. పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకుంటే ఎవరినేది ఆలోచించేప్పుడు మీకు అభ్యంతరం లేకపోతే లిస్ట్‌లో నా పేరు వుంచండి" స్పష్టంగా చెప్పాడతను.


ఆమె బిత్తరపోయిందో క్షణం. అతనెంత స్పష్టంగా చెప్పాడో! జీవితానికి పెళ్ళి ముఖ్యమనే స్థిరాభిప్రాయానికి రావటమే ఓ ఎత్తయితే, ఎవరిని జీవన భాగస్వామిని చేసుకోవాలని ఖచ్చితంగా నిర్ణయించుకోవటం మరో ఎత్తు. ఈరెండు



## ప్రేమరాహిత్యం

గతం కరిగింది సురాగాల శృతిలో
శృతి బేధించిన తంబుర నాదంతో వర్తమానం
జీరవోయిన గళం విప్పిన రాగం విరిగింది
స్మృతిగీతం మధుర జ్ఞాపికలా... అగ్నిలా...
పగిలిన కలల రథం మధుకలశాన్ని తేలేక పోయింది
అదే సంధ్య... అదే తారక... తొలి తారక
అవే చుక్కలు... ... ... అదే చీకటి
ఎద కనుమలలో అంచుల నొరుసుకుంటూ చీకటి నది
అదే రాత్రి... అదే చీకటి... అదే వాసన
ఆమె కురుల నలిగిన పూల మదపు వాసన
మా మాటలు గుసగుసలైన వేళ
మా నరాల రక్తపుపోటు కదన కుతూహలమైన వేళ
కరిగింది ... కరిగి పోయింది ... కాలం జర్గిగిపోయింది
ఈ క్షణం ఆ జ్ఞాపకాల నిప్ప కణికలు నెగడుల రగిలిస్తున్నాయి
రోడ్డు పక్కన ప్లాస్టిక్కు సంచి సారాతో గుండె తడిపి
ఈ రేయి చుక్కల మీద నేను వాంతి చేస్తే
ఈ రేయి చచ్చిపోయింది... ఆ చుక్కలు పారిపోయాయి
తెల్లారితే నేను రిక్షాలో... ఎచటికో...
ఎచటి కేగవలె బాటసారీ?... కా జానా సాబ్???
కలల రథం పార్క్ చేసిన చోటికి పోనీ
ధవణపు తడిక యిల్లు, మొగిలి రేకులు దానింటి మొగసాల
జాజిపూల పందిరి ఆసందు మొగదల
ఆ సందులో అందరూ పిలుస్తారు నవ్వుతూ ఏడ్వకుండా
ఆగకుండా పోనీ... ఏదీ మధుకలశం?

– ఆరవేటి శ్రీనివాసులు



## కీచురాయి

విద్ర నదిలోకి
రాత్రి–
నన్ను విసిరేస్తున్నా
అది
ఎడంకాలితో లేపి
నన్ను ఒడ్డుకి విసిరేస్తూనే వుంది.
వినుగుతో
పుస్తకం తియ్యబోతే
వాక్యాల్ని తప్పటోవ పట్టిస్తుంది
రాయబోతే
అక్షరాల్ని తికమకపెడుతుంది
ఏకాంతం
శిలువ ఎక్కబోతే
మెదడు కంట్లో
కాలుతున్న దృశ్యాల విభ్రాంతి
గుండెలో
ఊహలో
నరనరాల్లో దాని రొద
శ్వాసను అడ్డుకుంటోంది.
అది నాలుగు కాళ్ళ కీచురాయి కాదు
వేయి గొంతుల
సమస్యల కీచురాయి.
తప్పదు
ఆలోచనల కాగడాతో
రేయి జాగరణ.

—ఆసురాజేంద్ర

ఎత్తులను అవలీలగా ఎక్కిన హర్ష ఆమె మనసుకి ఎవరెస్టులా తోచాడు. ఆని మిషాన ... స్పష్టంగా నిర్ణయం తీసుకునేవేళ చిటారుకొమ్మన కిరణ్ చంద్ర చందం అందం ఆగమన్నది. ఎటూ తేలక నిద్రకు ఒరిగిందామె. తెల్లారుతూనే హర్ష వెళ్ళిపోయాడు.

***

ఆకృతి సీట్లో కూర్చునేసరికి కిరణ్ చంద్ర డిపార్ట్‌మెంట్‌లోకి వచ్చాడు. అప్ప టికి మిగిలినవాళ్ళెవ్వరూ ఇంకా రాలేదు.

"సాయంత్రం నాలుగ్గంటలకి బేగం పేట ఫ్లైఓవర్ దగ్గరకి రండి. ఈరోజు మీకు పార్టీ ఇస్తున్నాను" చెప్పాడతను.

ఆమె ఆమోదం కోసంఎదురుచూడకుండా వెళ్ళిపోయాడు.

"ఆకృతీ వచ్చావా. నీ కోసమే చూస్తున్నా. మా డిపార్ట్‌మెంట్‌లో కవితని సైట్‌కి ట్రాన్స్‌ఫర్ చేశారు" హడావుడిగా చెప్పింది రాగమణి.

"ఎందుకని"

"రోజూలేట్ అవర్స్ కూర్చోవాలంటే ఎవరికైనా కష్టమే కదా. తన పాప మరీ చిన్నది. ఆవిషయమే వాళ్ళ మేనేజర్‌కి చెప్పింది.పని ఎక్కువగా వుందని మరొకర్ని వేసుకోవచ్చు. అబ్బే వేసుకోరు. ఎదురు తిరిగిందని సైట్‌కి ట్రాన్స్‌ఫర్ చేశారు. వాళ్ళాయనకి ఇక్కడ వుద్యోగం. అక్కడికి ఎలా వెళుతుంది? రిజైన్‌చేసేసింది. మేనేజ్‌మెంట్‌కి కావాల్సింది అదే" బాధగా అంది రాగమణి.

"ఉద్యగం లేకపోతే తనకి కష్టంగా?
యూనియన్‌తో మాట్లాడితే"

"స్టాఫ్‌కి యూనియన్ ఎక్కడుంది? ఇలాంటి మాటలు గట్టిగాఅనకు. ఉద్యోగం వూడిపోగలదు" మెల్లగా అంది రాగమణి.

"మరి ఇప్పడెలా"

"ఏముంది. కవితకి ఫేర్‌వెల్ పార్టీ ఇవ్వటమే"

"సీతాచార్యులు ఖాళీ అవుతున్న కవిత సీట్‌కి అప్పడేఓ క్యాండిడేట్‌ని తెచ్చింది. ఆవిడకి యమ సంతోషంగా వుంది కవితని అలా ట్రాన్స్‌ఫర్ చెయ్యటం" అంది సుమన ఆకృతి టేబిల్ దగ్గరకి వస్తూ.

"అసలా పరేటర్ని మూసీలో ముంచెయ్యాలి" కోపంగా అంది రాగమణి.

మధ్యాహ్నం పోస్టులో తల్లి నుండి వుత్తరం వచ్చింది.

'అరుణ నటిస్తున్న సినిమా ఆర్థిక ఇబ్బందుల వల్ల మధ్యలో ఆగిపోయింది. తిరిగి ఎప్పడు మొదలుపెడతారో తెలియదు. అదృష్టంకొద్దీ ఆమెకి మరో రెండు వేషాలు దొరికాయి. నువ్వన్నట్టే వుద్యోగంలో చేరావు. పెళ్ళి సంగతి ఏం ఆలో చించావు. నువ్వు అవునన్నా కాదన్నా ఈ సంవత్సరం నీ పెళ్ళి చేసెయ్యాలి. ఇంకా ఇలా ఎంతకాలం!' నీ ఉద్యోగం సరదా తీరిందనే అనుకుంటున్నాను– అంటూ ఎదిగిన ఆడపిల్లల పెళ్ళి తల్లితండ్రులని ఎంత బాధిస్తుందో వివరంగా రాసిందామె.

ఆకృతి వుత్తరం పర్స్‌లో పెట్టుకొని పర్మిషన్ లెటర్ తీసుకొని సాయంత్రం రెండు గంటలు ముందు వెళ్ళిపోయేందుకు పర్మిషన్ కావాలని రాసింది. అది కమలాకర్ క్యాబిన్‌కి పంపించింది.

మార్కెటింగ్ డిపార్ట్‌మెంట్‌కి వెళ్ళి సుమనతో సాయంత్రం పార్టీకి వుండ టంలేదని చెప్పి, కవితతో అయిదు నిమిషాలు మాట్లాడి శలవు తీసుకుని డిపార్ట్‌మెంట్‌కి వచ్చింది.

నాలుగు గంటలకల్లా ఆకృతి ఫ్లై ఓవర్ దగ్గరకి వెళ్ళింది. కిరణ్‌చంద్ర అప్పటికే ఆమె కోసం కార్లో కూర్చుని చూస్తున్నాడు. ఫ్రంట్‌డోర్ తీసాడు. ఆమె కూర్చుంది. కారు మెత్తగా పోతోంది.

కిరణ్‌చంద్ర డ్రైవ్ చేస్తూ ఆమెనే గమనిస్తున్నాడు. నిశ్చలంగా కూర్చుంది.

'ఈ అమ్మాయి తామెటు వెళుతున్నామో కూడా అడగదేం!' అతనికి ఆశ్చ ర్యంగా వుంది.

"మీరెక్కడ చదువుకున్నారు" అడిగాడు కిరణ్‌చంద్ర.

"రాజమండ్రి"– 'గజపతులూ నరపతులూ ఏలిన వూరు' అనుకుందామె మనసులో.

"ఏ కాలేజ్"

"ఉమెన్స్"

"పేరేం లేదా"

"శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి కాలేజ్ ఫర్ ఉమెన్" – 'కొట్టుకొని పోయె కొన్ని కోటి లింగాలు–వీరేశలింగం ఒకడు మిగిలిన చాలు' శృతి చేసుకుందామె గళం.

ఇంటర్వ్యూలో చెప్పినట్టు బుద్ధిగా జవాబు చెపుతున్న ఆమెని చూస్తుంటే అతనికి నవ్వొచ్చింది.

"మీకు సిస్టర్స్ వున్నారా"

"ఆ" అందామె.

"ఎంతమంది."

"ఒకర్తే"

"ఏం పేరు"

"అరుణ"

"ఏం చేస్తున్నారు"

"ప్రస్తుతం సినిమాల్లో నటిస్తోంది."

"మీకంటే బాగుంటుందా ఆమె!" ఆశ్చర్యంగా అడిగాడు.

ఆకృతి జవాబు చెప్పలేదు.

"మనం ఎక్కడికి వెళుతున్నామని అడగరేం" అడిగాడు కిరణ్‌చంద్ర.

ఆకృతికి అతనంటే తనకంటె పై ఉద్యోగనే గౌరవం, భయం వున్నాయి. ఒకరకంగా అతని సమక్షంలో స్వేచ్ఛగా వుండలేకపోతోంది. మరోవేపు అతను తన పట్ల చూపిస్తున్న ప్రత్యేకాభిమానం రంగురంగు గాలి పటాలై హృదయాకా శంలో ఎగురుతూంది. కేవలం అతని అభిమానాన్ని గుర్తించే ఈ ఆహ్వానాన్ని అంగీకరించింది.

"ఎక్కడికి" అడిగిందామె.

"నాగార్జునసాగర్"

"ఇక్కడికి దగ్గరా?"

"నాలుగు గంటల ప్రయాణం. రాత్రి అక్కడే స్టే చేసి రేపొద్దున్న సాగర్ డ్యామ్ చూసి రేపు సాయంత్రం ఈవేళప్పుడు బయలుదేరి వద్దాం" చెప్పాడతను.

ఆమె జవాబు చెప్పలేదు. సాగర్ చూడాలని ఆమె చాలాకాలంగా అనుకుం టూనే వుంది. మనసుకి నచ్చిన తోడు లేక వెళ్ళలేదు. హర్ష ఎప్పుడూ హడావిడిగా వచ్చి వెళ్ళటమే తప్ప రెండ్రోజులున్నదీ లేదు.

రాత్రి తొమ్మిదవుతుండగా గెస్ట్‌హౌస్ చేరారిద్దరూ.

'మిస్టర్ అండ్ మిసెస్ కిరణ్‌చంద్ర' అని రిజిస్టర్‌లో రాసి సంతకం పెడుతున్న అతన్ని చూసి ఆమె బిత్తరపోయింది.

"అదేంటలా రాసారు" గదిలోకి రాగానే అడిగిందామె.

"మరేం రాస్తాం" తెల్లబోతూ అతనడిగాడు.

ఆమె మాట్లాడలేదు. ఒక అమ్మాయి, అబ్బాయి ఎంత చక్కని స్నేహితులై నాసరే ఒంటరిగా రూమ్ తీసుకుని వుంటే ఒప్పుకోని పరిస్థితులున్నంతకాలం లేని వరసలు, వంకలు తప్పవ్.

స్నానం చేసి విడిచిన చీరే కట్టుకుందామె. అతను మాత్రం తన బ్రీఫ్‌కేస్ నుండి లాల్చీపైజామా తీసుకుని వేసుకున్నాడు

"ముందు చెప్పి వుంటే మీరు బట్టలు తెచ్చుకునేవారు కదా" నొచ్చుకుంటూ అన్నాడతను.

"పర్లేదండి" అందామె.

డైనింగ్‌హాల్‌కి వెళ్ళి భోజనం చేసొచ్చారు. ఆమెకి ఆ చీకట్లో లేతవెన్నెల వెలుగులో కృష్ణవేణి ముగ్ధత్వం చూడాలని వుంది.

"పడుకుందామా" అడిగాడతను.

"సాగర్ చూద్దామా" అందామె.

"ఈ రాత్రేం పోతాం" అన్నాడతను.

ఆమె జవాబు చెప్పలేదు. అతన్ని మరోసారి అడగడానికి మొహమాటం.

ఆమె కిటికీ దగ్గర నిలబడి చూస్తోంది. అతనొచ్చి వెనగ్గా నిలబడ్డాడు. ఆమెఅతన్ని పట్టించుకోలేదు. అతను రెండు చేతులు కిటికీ వూచలపై ఆన్చాడు. ఆమె వీపుని, భుజాలని అతని వెచ్చని వూపిరి ముద్దాడుతుంటే ఆమె చప్పున వెనక్కి చూసి బిత్తరపోయింది.

అంత దగ్గరగా అతడిని ఆమె వూహించలేదు. అవి రోజూ చూస్తున్న చూపులు కావు. తృష్ణ, కాంక్ష నిండిన చూపది. ఆమెకీ స్థితి అయోమయంగా, చెప్పరాని ఇబ్బందిగా వుంది

అతను ఆమెలో కంగారుని గమనించి తిరిగి వెళ్ళి మంచంపై ఒరిగి "నాకు నిద్రొస్తూంది. మీకు రావటం లేదా?" అనడిగాడు.

ఆమె బెడ్‌వేపు చూసింది. రెండు మంచాలుకలిపి ఒకేమంచంలా వున్నాయి. అతడా మంచాలని దూరంగా జరిపే ప్రయత్నం ఏం చేస్తున్నట్టనిపించలేదామెకి. ఎలా పడుకోవాలి?

నిన్న రాత్రి ఇంతకంటే చిన్న గదిలో నేలపై పక్కలు పరుచుకొని పక్కపక్కనే తను, హర్ష పడుకున్నారు. "నిన్నలేని సంకోచం – భయం ఇప్పుడెందుకు ఆకృతీ?"

ఆమెవచ్చి మంచం చివర కూర్చుంది.

"ఆకృతీ నా గురించేం వివరాలు అడగలేదేంటి"

"చెప్పండి" అందామె.

"నాకు ఇద్దరు అక్కలు, ఒక చెల్లి, ఇద్దరు అన్నలు. అందరికీ పెళ్ళిళ్ళు అయ్యాయి. అంతా బొంబాయిలో సెటిల్ అయ్యారు. మీరుగానీ ఆఫీసులో కన్పించి వుండకపోతే నేనీ హైదరాబాద్‌లో ఉద్యోగం చేసేవాడినే కాదు! బాంబేలో ఎంజాయ్ చేసేవాణ్ణి"

"మీరు వుద్యోగం చెయ్యటం తప్పనిసరా?" అడిగాడతను.

'అంటే మీ ఇంటి పరిస్థితుల బట్టి తప్పకుండా చెయ్యాలా"

"మీరుచెయ్యటంలా"

"నేనంటే మొగవాడిని"

"అంటే స్త్రీకి వుద్యోగం అవసరం కాదా" ఆశ్చర్యంగా అడిగిందామె.

**నా కవితలెవరు కొంటారు?**

ఏమండీ! మీలో నా కవితలెవరైనా కొంటారా?
కవితలా! అబ్బే మాకెందుకండీ
పోనీ నా పాటలు??
తల అడ్డంగా ఊపి
పాటగాడు కావాలి గానీ పాటలేం చేసుకోమండీ!
సరేగానీ, నా ఆలోచనలైనా???
తిక్కవాన్ని చూసినట్లుగా ఫక్కున నవ్వారు
కనీసం నా బల్ల, పుస్తకాలు,
అరిగిన పెన్ను, విరిగిన మంచం,
చిరిగిన బట్టలు, పెరిగిన వెంట్రుకలు,
రగులుతున్న శరీరం — పగులుతున్న భూమికలు????
మేము కొంటాం — మేము కొంటాం
మీవి సమస్తం కొంటాం
ఆ కవితలు పాటలు తప్ప

ఆంగ్ల మూలం: రస్కిన్ బాండ్
స్వేచ్ఛానువాదం: కె. వెంకటరెడ్డి

"నే కోరుకునేస్త్రీకి అవసరం లేదు" అన్నాడతను.

"అదేంటి! నేనుమీ సర్కిల్‌ని చూశానుగా. చదువుకున్నవాళ్ళు, వుద్యోగస్థులు, నవనాగరీకులు" ఆశ్చర్యపోతూ అందామె.

"వాళ్ళంతా స్నేహితులు"

"అయితే"

"వాళ్ళు స్నేహితులు- అంతే. నాకు నా భార్యవుద్యోగం చెయ్యటం ఇష్టం లేదు" అన్నాడతను.

"ఏం ఎందుకని"

"నలుగురు మగవాళ్ళతో కలిసి వుద్యోగం చేసే ఆడవాళ్ళు రోజూ పది మందితో పది రకాలుగా కామెంట్స్ భరించాలిగా" అన్నాడతను.

"అణగారిన జాతి పైకి రావాలంటే కష్టపడాల్సిందే! ఏ కష్టనష్టాలూ అనుభ వించ కుండానే అభివృద్ధి సాధించటం సాధ్యమా? మా ముందు తరంలో ఎంతో మంది ఎన్నో ఇబ్బందులుపడి చదువుకోడానికి బయటికి రావటం వల్లనేగా, నేను ఈ రోజు ఇలా ఇష్ట ప్రకారం సాగర్‌వరకు రాగలిగాను" అందామె.

అతను నవ్వి "లైట్ ఆర్పుదామా" అన్నాడు.

"కావలిస్తే మీరు ఆర్పుకోండి" అందామె.

ఆమె మంచంపై చేరబడింది. అతను లైటార్పి మంచంపైవాలాడు.

"ఆకృతి"

"వూ"

అతను కాస్త ఆమెవేపు జరిగి ఆమె చేతులని చేతుల్లోకి తీసుకుంటూ "ఉద్యోగం మానెయ్! నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాను" అన్నాడు.

"ఉద్యోగం చేస్తున్న నన్నెందుకు ఇష్టపడ్డారు?" అడిగిందామె.. ఇబ్బందిగా చేతులు కదుపుతూ.

"ఒకటి అందం. రెండు రిజర్వ్‌డ్‌నెస్" అన్నాడతను.

ఆమెకి ఒక్కసారిగా నిస్సత్తువ ఆవరించింది.

"ప్రేమంటే ఏమిటి? ఈ ప్రేమకి అందానికి సంబంధం ఏమిటి? మనిషి అందంగా వుంటే ప్రేమించొచ్చా? తనకి చాలా మంది మగవాళ్ళు అందంగా కన్పించారు. కానీ ఆ అందం ఆహ్లాదాన్ని, ప్రశాంతిని, చెలిమి చలువనీ ఇచ్చేలా తోచలేదు...ఇప్పుడే కిరణ్ చంద్రకి తనూ ఓ భ్రమగా మిగిలిపోతుందా! అతను తనకి నచ్చిన అమ్మాయి భార్యగా వస్తే ఆ స్త్రీ అందం, సంస్కారం,తెలివి తేటలు, అభిరుచులు తనకి మాత్రమేపరిమి తం కావాలనుకుంటున్నాడు. ఆ స్త్రీ అతనికో స్టేటస్‌సింబల్. పువ్వుల్లో తప్పక పెడతాడు. ఇంతకీ అవి ఏ పూలు? కాగితం పూలా? గుల్ మెహూర్ పూలా?

## తెల్ల మచ్చలకు చికిత్స

శక్తివంతమైన, అద్భుతమైన మా ఆయుర్వేద చికిత్సను ప్రారంభించిన 36 గంటలలోనే మచ్చల రంగు మారడం ప్రారంభమవుతుంది. త్వరలోనే మామూలు శరీరపు రంగుకు చేరుకుంటాయి. ఒకసారి ఈ చికిత్స ప్రయత్నించి చూడండి. ఫలితాలతో తప్పక సంతృప్తి చెందుతారు. చికిత్స నిమిత్తం మీ వ్యాధి యొక్క పూర్తి వివరాలను వ్రాయండి, ఒక ప్యాకెట్ మందును ఉచితంగా పొందండి.

**Parag Clinic** (A/21) P.O. Katri Sarai (Gaya)

## తెల్లజుట్టు నల్లబడడానికి చికిత్స

మా చికిత్స బాలనెరుపు, జుట్టు రాలటాన్ని నివారించి, తెల్లబడ్డ జుట్టును సహజసిద్ధమైన నలుపు రంగుకు వచ్చేటట్టు చేస్తుంది. మృదువైన పొడుగాటి వెంట్రుకలకు, మెదడును చల్లగా వుంచటానికి దోహదపడుతుంది. కండ్ల బలహీనతలకు ఎంతో మేలైనది. ధర ఒక కోర్సుకు రూ.80/-. పోస్టేజి మరియు ప్యాకింగ్ అదనం.

**Parag Clinic** (A/65) P.O. Katri Sarai (Gaya)

## సంతోషప్రదమైన వైవాహిక జీవితం

ఏ కారణం వల్లనైనా మీ వైవాహిక జీవితం ఆనందప్రదంగా లేకపోతే, సిగ్గుతోనో, భయంవల్లనో మీ సెక్స్ వ్యాధులను దాచుకోనటానికి ప్రయత్నించకండి. చికిత్స నిమిత్తం మీ వ్యాధి పూర్తి వివరాలను మాకు వ్రాయండి. వైవాహిక జీవితంలోని ఆనందాన్ని అనుభవించండి.

**Parag Clinic** (A/GR) P.O. Katri Sarai (Gaya)

## అపూర్వ శక్తిగల ఉంగరం

మీరు ఇప్పుడు నిరాశ చెందకండి. శుభ ముహూర్తంలో గ్రహానుసారం తయారుచేయబడిన ఈ తాంత్రిక ఉంగరం ధరించడం వలన కోరుకున్న స్త్రీ లేదా పురుషుని వశం చేసుకునే వీలుంది. కఠిన హృదయులు కూడా మీ వశంలోనికి వచ్చి, మీ అడుగుజాడలలో నడుచుకుంటూ మీ ఆజ్ఞను శిరసావహిస్తారు. ఇష్టపడినవారితో వివాహం జరుగుతుంది. ఉద్యోగం దొరుకుతుంది. ప్రేతాత్మలతో మాట్లాడవచ్చు. కోర్టులో గెలిచే అవకాశం వుంది. పరీక్షలలో ఉత్తీర్ణులవ్వవచ్చును. వ్యాపారంలోలాభం వస్తుంది. దుష్ట గ్రహాలు శాంతిస్తాయి. జీవితం సుఖ శాంతులతో నడుస్తుంది.

ఈ తాంత్రిక ఉంగరం యొక్క వెల రూ.31/-. 24 గంటలలో వెంటనే ప్రభావం చూపిస్తుంది. మీ పేరు ప్రకారం అష్ట ధాతువులతో తయారుచేయబడుతుంది. చాందీ వారి ప్రత్యేక సికిందర్ ఉంగరం వెల రూ.151/-. తపాలా ఖర్చులు అదనంగా చెల్లించవలసి వుంటుంది. ఈ ఉంగరాల ప్రభావం ఎప్పుడూ తప్పుగా పనిచేయదు. వీటి ప్రభావం సరిగా కనుక లేకుంటే మీరు చెల్లించిన మూల్యానికి రెట్టింపు వాపసు చేయబడుతుంది. ఇది వాస్తవం కాదని నిరూపించగల్గినట్లయితే అట్టివారికి రూ.1000/- నగదు రూపంలో ఇవ్వబడుతుంది. ఒకసారి వాడి చూడండి. మీకే తెలుస్తుంది.

**V.P.P.** ద్వారా తెప్పించుకునే చిరునామా:

**KABAIR ASHRAM (AJ/92)**
P.O. Malra Barith (Gaya)

"ఏంటాకృతీ మాట్లాడడం లేదు? మనిద్దరం పెళ్ళి చేసుకుందామా? ఇంతకు ముందే నీ మనసులో మరెవ్వరైనా వున్నారా" అడిగాడతను. ఆ ఏకవచన సంబోధన స్నేహంగానే వుంది.

ఆకృతికి నవ్వొచ్చింది. ఏం చెప్పాలి?

"పెళ్ళయినా వుద్యోగం మానను. నేనో విషయం చెప్తాను. మీ సెలక్షన్ తప్పని మీకే తెలుస్తుంది" అందామె.

"ఏంటది?"

"నాకు ఏ మగ ఫ్రెండ్‌లేరని మీరనుకుంటున్నారు కదా?"

"మగవాళ్ళు తెలియకుండా ఎలా వుంటారు. కాని ఫ్రెండ్స్ లేరనుకుంటున్నాను" అన్నాడతను.

"అదే పొరపాటు.నిన్నరాత్రి కూడా ఇలాగే మరో అబ్బాయి, నేను నా గదిలో పక్కపక్క పడుకొని కబుర్లు చెప్పుకున్నాం" అందామె.

కిరణ్ చంద్ర ఆశ్చర్యంగా చూస్తూ "నిజమా" అన్నాడు.

ఇద్దరిమధ్య నిశ్శబ్దం. అతనికి బాధగా వుంది. ఆకృతిని చూసీ చూడగానే అతను చాలా ఆనందపడ్డాడు. ఆమె ఆఫీసులో రిజర్వ్‌డ్‌గా వుండడం చూసి ఎంతోముచ్చట పడ్డాడు.అందమైన భార్యదొరకొచ్చు. కాని అణుకువగా,నిజాయితీగా వుండే అమ్మాయి, తనకి మాత్రమే పరిమితమయ్యే అమ్మాయి దొరకటం కష్టం.

అతను ఆలోచనల నుండి తేరుకొని ఆకృతి వేపు చూశాడు. ఇప్పుడామె అతనికి ఇంతకు ముందంత అమాయకంగా తోచటం లేదు.

ఆలోచనలతోనే ఎవరికి వారు నిద్రలోకి జారుకున్నారు.

ఉదయం లేచి అతను లాంచి వెళ్ళిపోతుంది త్వరగా తయారవ్వమని తొందర చేశాడు.

"లాంచి ఏంటి" అడిగిందామె.

"నాగార్జున కొండ దగ్గరకి నీళ్ళల్లో వెళ్ళాలి" అన్నాడతను.

"హైదరాబాద్ వెళ్ళిపోదామా"?"

"మీరనుకున్నట్టు మీరు నేను ఏం కాబోటం లేదుగా" అందామె.

"అయితే ఏం? చూసొద్దాం"

ఎవరితోనైనా ఏవైనా అనుభూతుల్ని పంచుకోగలిగే అతణ్ణి చూస్తూ "నేరా లేను" అందామె.

అతను బలవంతం చెయ్యలేదు. కారు సిటీ పొలిమేరలకి రాగానే

"మనం ఫ్రెండ్స్‌గా వుండడానికి అభ్యంతరమా" అడిగాడతను.

ఆమె నవ్వింది. కారు ముందుకు సాగింది.

***

ఆకృతి ఆరాత్రి ఆఫీసుకి లీవ్ లెటర్ పోస్ట్ చేసింది. ఎయిర్‌బ్యాగ్‌లో బట్టలు సర్దుకుంది. బస్సు ఎక్కింది.

"ఏంటిలా వచ్చారు" సంతోషంగా అడిగాడు హర్ష.

"గోదారిని చూద్దామని"

"కాదునన్ను చూడాలనే"ఆనందంగా అన్నాడు.

"అన్నింటికంటే ముందు పసుపు డబ్బా ఎక్కడుందో వెతకాలి" అందామె.

అతని కళ్ళలో మెరుపుల మాల!

"నల్లపూసలొద్దా"

"మట్టెలుకూడా కావాలి"

"ఇవి సరే- తమరి వుద్యోగం సంగతి ఏంటి"

"మరో వుద్యోగం దొరికేవరకు మీ గోదారొడ్డున, నేనా గుల్‌మొహర్ అవెన్యూలోను" అంటూ హర్షనాదమై జీవనాధారమై హర్షజంట్లో అడుగిడింది ఆకృతి.

(సమాప్తం)